
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 5
ఆదివారం 16 మార్చి 2025

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరీ
	ఆదివారం	సోమవారం
కర్నూలు	6:33	5:03
నంద్యాల	6:30	5:03

ఎండలు బాబోయ్..!



జన సంచారం లేని బళ్లారి చౌరస్తా





ఎండకు గొడుగులతో వెళ్తున్న విద్యార్థినులు



నిర్మానుష్యంగా రాజ్‌విహార్ సర్కిల్

వామ్మో...
ఎండలు మండిపోతున్నాయి. మే నెల రాకముందే ఏప్రిల్‌లోనే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రాకుండా జనం ఇళ్లకే పరిమితమవుతున్నారు. దీంతో నగరంలో ఎంతో రద్దీగా ఉండే ప్రధాన రహదారులు సైతం బోసిపోతున్నాయి. బళ్లారి చౌరస్తా, చెన్నమ్మ సర్కిల్, కలెక్టరేట్, రాజ్‌విహార్ సర్కిల్ తదితర ప్రాంతాలు మిట్టమధ్యాహ్నం నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. శనివారం కర్నూలు సిటీలో 41.5 డిగ్రీలుగా పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో అత్యధికంగా కల్లూరు మండలంలో 41.8 డిగ్రీలు నమోదు కాగా ఆ తర్వాతి స్థానాల్లో కోసిగి 41.7, కోడుమూరు 41.6 డిగ్రీలుగా నమోదైంది. ఏప్రిల్ నెల రెండో వారంలోనే పరిస్థితి ఇలా ఉంటే మే నెలలో ఎండలు ఎలా ఉంటాయో మరి.

-కర్నూలు న్యూసిటీ (ఆంధ్రజ్యోతి)

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, కర్నూలు

ప్లాస్టిక్ వాడకాన్ని మానుకోవాలి

ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే

కర్నూలు న్యూసిటీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని స్వచ్ఛందంగా మానుకోవాలని జిల్లా ఇంచార్జి అధికారి, రహదారులు, భవనాలు, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగరంలోని కొండారెడ్డి బురుజు ఎదురుగా ఉన్న ఓపెన్‌ఎయిర్ ఆడిటోరియంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ పి.రంజిత్‌బాష, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ 30 ఏళ్ల కిందట మన ఇంటికి పెద్దవారు వచ్చినప్పుడు గొడుగు, చేతి సంచి, ఇత్తడి మరచెంబుతో వచ్చేవారని, ప్రస్తుత కాలంలో అవన్నీ వెళ్లి పోయి వాటి స్థానంలో ప్లాస్టిక్ వచ్చేసిందన్నారు. ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ వచ్చాయన్నారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను ఆయన వివరిస్తూ ప్లాస్టిక్ కొన్ని వందల సంవత్సరాలయినా కూడా మట్టిలో కలిసిపోదన్నారు. అందువల్ల ప్లాస్టిక్ అవశేషాలు మనం తినే అన్ని రకాల ఆహార పదార్థాలలో చేరి, చాలా రకాల జబ్బులు వస్తున్నాయన్నారు. కాబట్టి ప్లాస్టిక్‌ను మన దైనందిన జీవితం నుంచి నిషేధించాలన్నారు. కలెక్టర్ రంజిత్ భాష మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి పర్యావరణాన్ని కాపాడటం మన బాధ్యత అని అన్నారు. చివరగా సమావేశంలో పాల్గొన్న వారిచే ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రతిజ్ఞ చేయించారు. నగర పాలక అధ్వర్యంలో రూపొందించిన పోస్టరును విడుదల చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ప్లాస్టిక్ రహిత భోజన ప్లేట్లు, నేలను శుభ్రం చేసే మాప్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ మహేశ్వరరెడ్డి, ఈఈ సురేష్ డీటీసీ శాంతికుమారి, ఆర్‌టీఓ బర్హత్ చౌహన్, హెల్త్ ఆఫీసర్ కె.విశ్వేశ్వరరెడ్డి, ఆర్డీఓ సందీప్‌కుమార్, పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కొండారెడ్డి బురుజు ఎదురుగా శుభ్రం చేస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ, కలెక్టర్, ట్రైనీ కలెక్టర్, ఆర్‌డీఓలు

ఘనంగా గరుడోత్సవం

● 'ఎగువ'లో ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు ● దిగువ అహోబిలంలో తీర్థవాది



ఎగువలో గరుడ వాహనంపై కొలువై మాడ వీధుల్లో విహరిస్తున్న జ్వాలా నరసింహస్వామి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఉగ్రం వీరం మహా విష్ణుం జ్వలంతం సర్వతోముఖం.. సకల కార్యకారణ స్వరూపుడై సకల లోకాల్లో, సర్వాత్మల్లో తన తేజస్సును ప్రకాశింపజేస్తూ ఎగువ అహోబిల క్షేత్రంలో అవతరించిన ఉగ్ర నారసింహుడి గరుడ ఉత్సవం శనివారం వైభవంగా జరిగింది. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవీ, భూదేవీ సమేత జ్వాలా నరసింహ స్వామి ఉత్సవమూర్తులను పట్టుపీతాంబరాలు, పూలమాలలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. విశేషాలంకరణ చేసిన గరుడ వాహనంపై జ్వాలా నరసింహ స్వామిని కొలువుదీర్చి గరుడ సేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా ఆలయ అర్చకులు ధ్వజావరోహణం చేపట్టారు.

'దిగువ'లో తీర్థవాది, చక్రస్నానం

దిగువ అహోబిలంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా అర్చకులు శనివారం ఉదయం శాస్త్రోక్తంగా తీర్థవాది, చక్రస్నానం నిర్వహించారు. ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాద వరద స్వామి ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం, నవకలశ తిరుమంజనం నిర్వహించారు.

నేడు ఏపీపీఎస్సీ పరీక్ష

సమీక్షించిన జాయింట్ కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏపీపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలోని జూనియర్ అసిస్టెంట్ పరీక్షలపై అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం నిర్వహించే ఫారెస్టు రేంజ్ అధికారి పరీక్షకు 1,250 మంది హాజరు కానున్నారని, 17వ తేదీ నిర్వహిచే ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్లకు 393 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. నంద్యాల చెక్‌పోస్టు దగ్గర గల అయాన్ డిజిటల్ సెంటర్, పుల్లారెడ్డి ఇంజనీరింగ్, ఎమ్మిగనూరులోని సెయింట్ జోసెఫ్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ వెంకట్రావు, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఏపీఎస్పీడీసీఎల్ సిబ్బంది, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో ఆదాయం

రాయలసీమ జిల్లాలోనే ఆదోని మార్కెట్ యార్డు టాప్

ఆదోని అగ్రికల్చర్ , మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరిందని మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి శనివారం తెలిపారు. 2024-25 ఏడాదికి నిర్దేశించిన లక్ష్యం రూ.17.10 కోట్లు కాగా 15 రోజులు ముందుగానే చేరుకున్నామని చెప్పారు. రాయలసీమ జిల్లాల్లోని ఆదోని మార్కెట్ కమిటీ ఆదాయపు వసూళ్ల లక్ష్యంలో నెంబర్ వన్‌గా నిలిచిందన్నారు. కర్నూలు జిల్లాలోని ఏడు మార్కెట్ల ఆదాయపు వసూళ్ల లక్ష్యం రూ.36.14 కోట్లు కాగా.. ఇప్పటి వరకు రూ.36.81 కోట్లు చేకూరిందని తెలిపారు. ఇందులో ఆదోని మార్కెట్ కమిటీకి 17.10 కోట్లు లక్ష్యం కాగా ముందుగానే అధిగమించామని చెప్పారు. ఇంకో 15 రోజుల్లో మరో రూ.50 లక్షలకు పైగా ఆదాయాన్ని సమకూరుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లా ఏడు మార్కెట్ కమిటీలలో రూ.25.85 కోట్ల లక్ష్యానికిగాను ఇప్పటి వరకు రూ.19.86 కోట్లు సమకూరిందని స్పష్టం చేశారు. నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించి రాయలసీమ జిల్లాలోని టాప్‌గా నిలవడం సంతోషంగా ఉందన్నారు.

పాతాళానికి ఉల్లి ధర



కర్నూలు అగ్రికల్చర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. నిన్న మొన్నటి దాకా గరిష్ఠ ధర క్వింటంపై రూ.2 వేలకు పైగానే రైతులు అందుకున్నారు. శనివారం రూ.1,409కు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మధ్యస్థ ధర రూ.744, కనిష్ఠ ధర రూ.585కు తగ్గిపోయింది. కందులకు పూర్తిగా ధర తగ్గింది. గత సంవత్సరం క్వింటంపై రూ.10 వేలు అందుకున్న రైతులకు ఇప్పుడు గరిష్ఠం రూ.6,799, మధ్యస్థం రూ.6,681, కనిష్ఠ ధర రూ.3 వేలు మాత్రమే దక్కింది. ఎండుమిర్చికి వివిధ రకాలకు సంబంధించి 12,809 నుంచి రూ.9,041 దక్కింది.

ముగిసిన మెయిన్ పరీక్షలు

చివరి రోజు 393 మంది గైర్హాజరు

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం మెయిన్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. బ్రిడ్జ్, లాంగ్వేజెస్ కోర్సులకు మిగిలిన పరీక్ష ఈ నెల 17వ తేదీన జరుగుతుంది. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు మార్చి 1వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 3వ తేదీ నుంచి మొదలయ్యాయి. పరీక్షలు పూర్తయిన విద్యార్థులు ఏపీఈఏపీ సెట్, నీట్, జేఈఈ-అడ్వాన్స్ మెయిన్స్, జేఈఈ-అడ్వాన్స్‌డ్ వంటి పోటీ పరీక్షలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇంటర్ బోర్డు పరీక్షల తర్వాత ఉన్నత విద్య కోసం ప్రసిద్ధి గాంచిన విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందేందుకు పోటీ పరీక్షల్లో వచ్చే ర్యాంకులపైనే ఆధారపడాల్సి ఉంది. కర్నూలు జిల్లాలో 161 కళాశాలల నుంచి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 45,325 మంది నమోదు చేసుకున్నారు. శనివారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు జిల్లాలో మొత్తం 19,596 మంది నమోదు చేసుకున్నారు. వీరిలో 393 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు కృషి చేసిన అధికారులు, అధ్యాపకులకు ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి ధన్యవాదాలు తెలిపారు. కాగా ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలకు 656 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. 579 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 77 మంది గైర్హాజరైనట్లు డీఈవో శ్యామ్యూల్ పాల్ తెలిపారు.

కట్టలు కట్టలే..!



● సాయంత్రమైతే జేబుల నిండా డబ్బులే
● రిజిస్ట్రేషన్ శాఖలో జోరుగా అవినీతి దందా
● రోజుకు రూ.లక్షల్లో అక్రమ ఆదాయం
● లంచం ఇస్తేనే క్రయ, విక్రయాలు పూర్తి
● నేరుగా పోతే మాత్రం కొర్రీలే..!
● సస్పెండ్ అవుతున్నా కనిపించని మార్పు

నంద్యాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దోపిడీకి హద్దు లేకుండా పోతోంది. ఆయా కార్యాలయాల వారీగా ఎక్కడికక్కడ దోచేస్తున్నారు. క్రయ విక్రయదారుల నుంచి రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్నారు. కొందరు డాక్యుమెంట్ రైటర్లు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది సైతం తమదైన శైలిలో చేతివాటం ప్రదర్శిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. ఏసీబీ దాడులతోపాటు శాఖ పరమైన చర్యలు తీసుకున్నప్పటికీ సబ్ రిజిస్ట్రార్లలో మాత్రం మార్పు కనిపించడం లేదు. జిల్లాలోని నంద్యాల జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఎక్కడ చూసినా అక్రమ వసూళ్ల దందా కొనసాగుతోందన్న విమర్శలు ఉన్నాయి. మామూళ్లు సమర్పించుకుంటే తప్ప ఫైల్ కదలడం లేదని కొందరు బాధితులు వాపోతున్నారు. ఎంతో కొంత ఇస్తే తప్ప అధికారులు, సిబ్బంది పని చేయడం లేదని ఆరోపిస్తున్నారు. కొందరు ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది, కొందరు డాక్యుమెంట్ రైటర్లు సిండికేట్‌గా మారి క్రయవిక్రయ దారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడినట్టు తెలిసింది.

జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రధానంగా మూడు రకాలైన క్రయ విక్రయాలు ఎక్కువగా జరుగుతాయి. సేల్ డీడ్, దాన ధర్మం, భాగ పరిష్కార రిజిస్ట్రేషన్‌లు జరుగుతుంటాయి. వీటిలో ఏ పని కావాలన్నా మామూళ్లు చెల్లించాల్సిందే. ఇందుకోసం ప్రత్యేకంగా కార్యాలయ సిబ్బంది, కొంత మంది దస్తావేజు లేఖరులు ప్రత్యేక పర్సంటేజీలు ఖరారు చేశారు. అధికారుల కోసమని సేల్ డీడ్‌కు- 3 నుంచి 5 శాతం, దాన ధర్మం - 1 నుంచి మూడు శాతం, భాగ పరిష్కారం- 2 నుంచి ఐదు శాతం చొప్పున అదనంగా వసూలు చేసి దోపిడీకి గురి చేస్తున్నారని బాధిత వర్గాల నుంచి తెలిసింది. అదేవిధంగా ఏదైనా ప్లాట్, స్థలం కొనుగోలు చేస్తే వాటి విలువను తక్కువగా లెక్కిస్తే ఐదు నుంచి పది శాతం వరకు సమర్పించుకోవాల్సిందే. క్రయ విక్రయదారులు మామూళ్లు ఇవ్వకపోతే నిబంధనల పేరుతో వివిధ రూపాల్లో కొర్రీలు విధించి వెనక్కి పంపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాస్తవంగా ఏదైనా రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే స్టాంపుల రూపంలో (సదరు భూమి, స్థలం మార్కెట్ విలువలో రూ. లక్షకు.. 7.5 శాతం చొప్పున) రూ.7500 చలానా తీయాల్సి ఉంది. అయితే నిబంధనలు అటు ఇటు ఉండటం, రిజిస్ట్రేషన్ గురించి తెలియని వారు దళారులు, రియల్ ఎస్టేట్ బ్రోకర్ల ద్వారా వస్తే ఈ చలానా ఏకంగా రూ.20 వేల వరకు పెంచి మరీ వసూలె చేస్తున్నారని సమాచారం. వీటికితోడు ఈసీలు, నకల్లు, వివాహ ధ్రువీకరణ పత్రాలు తదితర పత్రాల రూపంలో తమదైన శైలిలో చేతివాటం ప్రదర్శించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు. కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మరీ దారుణం. ఏదైనా రిజిస్ట్రేషన్ సమయంలో ఒప్పందం ప్రకారం అడిగినంతా కాకుండా తక్కువ ఇస్తే మాత్రం అంతే సంగతులు. సదరు క్రయ విక్రయదారులకు సంబంధించి రిజిస్ట్రేషన్ జరిగిన తరువాత డాక్యుమెంట్‌లు కంప్యూటరీకరణ చేయకుండా పెండింగ్‌లో పెట్టి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారని బాధిత వర్గాలు ఆరోపిస్తున్నాయి.

రిజిస్ట్రేషన్ల వారిగా ...

జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రతిరోజూ జరిగే రిజిస్ట్రేషన్లను బట్టి వసూళ్లు చేస్తున్నారు. రోజుకు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో మరింత ఎక్కువగాను.. తక్కువగా జరిగే ప్రాంతాల్లో కొంచెం తక్కువగా అక్కడ పరిస్థితిని బట్టి అక్రమ వసూళ్లకు తెరలేపారు. ప్రధానంగా డాక్యుమెంట్ రైటర్లకు తోడు బయటి వ్యక్తుల ద్వారా దస్తావేజు తయారు చేసేందుకు రూ.4 నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తుంటారు. అన్ని సక్రమంగా ఉన్నప్పటికీ అనధికారికంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందికి ఇవ్వాలంటూ అదనంగా రూ.3 నుంచి రూ.5 వేలు వసూలు చేస్తూ రోజుకు రూ.లక్షల్లో అవినీతి సొమ్మును మూట గట్టుకుంటున్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే వీటికి రెట్టింపు స్థాయిలో వసూలు చేస్తున్నారని సమాచారం.

ఫిర్యాదులు మా దృష్టికి రాలేదు..

సబ్ రిజిస్ట్రార్లు, సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు అక్రమంగా డబ్బులు వసూలు చేసినట్లు మా వద్దకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. సమస్య ఉంటే క్రయ విక్రయదారులు మా దృష్టికి తేవాలి. డాక్యుమెంట్ రైటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఈసీ, నకల్లు, వివాహ ధ్రువీకరణ తదితర పత్రాల కోసం నిబంధనలు ప్రకారం సేవలందించేలా చూస్తాం. ఇకపై ఇలాంటి వాటికి తావు లేకుండా ప్రత్యేక దృష్టి పెడతాం.

- జానకిదేవి, జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ

మచ్చుకు కొన్ని..

● నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొందరు సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని తెలిసింది. ఈసీ, నకల్లు, వివాహ ధ్రువపత్రాల మంజూరులో నిబంధనల కంటే ఎక్కువగా వసూలు చేస్తున్నారని బాధిత వర్గాల ఆరోపణ. కొందరు బయటి వ్యక్తుల ద్వారా ఓ అధికారి సాయంత్రం కాగానే ఆ రోజు జరిగిన రిజిస్ట్రేషన్ల పరంగా లెక్కకట్టి పంపకాలు చేస్తున్నట్లు ఆ శాఖ వర్గాల ద్వారా తెలిసింది.

మిగతా 7వ పేజీలో

ముగిసిన కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్య ప్రదర్శన శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

నంద్యాల కల్చరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కూచిపూడి నృత్య ప్రదర్శనలోని 108 కర్ణాలు(భంగిమలు)పై శుక్రవారం నాట్యగురువు పల్లంశెట్టి సురేష్ శిక్షణ నిర్వహించారు. నంద్యాల ఎస్‌బీఐ కాలనీలో నంది ఫైన్ ఆర్ట్స్, ఆర్టిస్ట్స్ డెవలెప్‌మెంట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ సహకారంతో ఈనెల 7 నుంచి 14 వరకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా నాట్యాచారుడు సురేష్ మాట్లాడుతూ కూచిపూడి ప్రాచీన కాలం నుండి 108 కర్ణాలు అనగా నాట్య భంగిమలు ఆధారంగా ఎన్నో దేవాలయాల్లో అద్భుతంగా శిల్పకళా రూపంలో చిత్రించారని వాటి గురించి నేటి తరానికి అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో శిక్షణా కార్యక్రం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కూచిపూడి నాట్యంలో శిక్షణ కార్యక్రమంలో భాగంగా అహోబిలంలోని దేవాలయంలోని శిల్పాలని పోలుస్తూ నాట్యగురువులు సురేష్, మౌనికలు 108 కర్ణాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

కళ

కర్నూలు ఉస్తాద్..



కర్నూలు పాత బస్తీలో పుట్టి పెరిగి జాతీయ స్థాయిలో హిందుస్థానీ స్వర విహారం చేసిన విఖ్యాత ఖవ్వాలీ గాయకుడు ఉస్తాద్ న్యామతుల్లా తెలుగువారికి గర్వకారణం. ఆయన ఖవ్వాలీ సంగీత సంప్రదాయంలో పుట్టిపెరిగారు. ఆయన తండ్రి సుప్రసిద్ధ హిందుస్థానీ సంగీత విద్వాంసుడు ఉస్తాద్ మహ్మద్ జాఫర్ పేరు విననివారు ఉండరు. ఖవ్వాలీకి ఆయన శాశ్వత చిరునామా. ఆయన ప్రభావంలో, శిక్షణలో న్యామతుల్లా ఖవ్వాలీ పాటల బాటసారిగా ఎదిగారు. ఆయన సంగీతానికి గుర్తింపుగా న్యామతుల్లా పేరుకు ముందు ఉస్తాద్ అనే పదం వచ్చి చేరింది. తన 78 ఏళ్ల ప్రాయంలోనూ ఆయన చాలా ఉత్సాహంగా ఉన్నారు.

కర్నూలు కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఖవ్వాలీ పాటలు పాడుతూ దేశవ్యాప్తంగా అనేక చోట్ల ప్రదర్శనలు ఇచ్చి ప్రత్యేక గుర్తింపు తెచ్చు కున్న న్యామతుల్లా యువకునిగా ఉన్నప్పుడే హిందు స్థానీ సంగీతంలో నిష్ణాతుడై, తబలా వాయిద్యంపై ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ వంటి వారి నుంచి ప్రశంసలు అందుకు న్నారు. ఇటీవల సంగీత శబ్ద మాంత్రికుడు ఏఆర్ రహమాన్ ముందు కూడా తన తబలా పాండిత్యాన్ని అనేక సార్లు ప్రదర్శించి భేష్ అనిపించుకున్నారు. ఇక దోగాడే ప్రాయం నుంచే తండ్రి ఉస్తాద్ మహ్మద్ జాఫర్ ఒడిలో కూర్చొని ఖవ్వాలీ పాటలను ఆస్వాదించారు. పన్నెండేళ్ల ప్రాయంలో చేసిన తొలి కచేరీ ఆయన జీవితాన్ని పూర్తిగా మలుపు తిప్పేసింది. ఎంతలా అంటే జాతీయ స్థాయిలో నూ అనేక మంది ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకునేలా నిలబెట్టింది. ఆయన పేరుకు ముందు 'ఉస్తాద్' అనే బిరుదును కూడా అలంకరింపజేసింది. హైస్కూల్ విద్య వరకే చదువుకు న్నా ఆయన సంగీతానికి ఆసక్తి, అభిరుచి ఒక్కటే ముఖ్యమని నిరూపించారు. స్వరాలకు కులమత భేదాలు లేవంటూ దేశవ్యాప్తంగా 3వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. ఇప్పటికీ ఇస్తున్నారు.

- హిందుస్థానీ సంగీతంలో ఉస్తాద్ న్యామతుల్లా
- ఖవ్వాలీ పాటలే ఆయనకు జీవితం
- తబలిస్టు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ నుంచి ప్రశంసలు
- ఏఆర్ రహమాన్ ముందు అనేక సార్లు ప్రదర్శనలు
- జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన వైనం

బాల్యం...కుటుంబ నేపథ్యం...

కర్నూలు ఖడక్‌పురకు చెందిన ఉస్తాద్ చూరన్ ఖవ్వాలీ అంటే 1940 దశకంలో పెట్టింది పేరు. ఆయన సూఫీ సాహిత్యాన్ని మేళవించిన ఖవ్వాలీ గీతాలతో దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందారు. ఆయనకు రెండో సంతానంగా 1947 ఏప్రిల్ ఒకటిన న్యామతుల్లా జన్మించారు. ఆయన సంతానంలో చివరి వాడైన న్యామతుల్లా పుట్టిన ఏడాదికే తల్లి జహరా బీ కన్నుమూసింది. అయితే తండ్రి మళ్లీ పెళ్లి చేసుకోకుండా ముగ్గురు పిల్లలను తానే చూసుకునేవారు. అలా ఆయన వెంట పిల్లలు కూడా కచేరీలకు వెళ్లేవారు. తండ్రి ఒడిలో కూర్చొబెట్టుకుని కచేరీ చేస్తుంటే పసి బాలుడు ఆసక్తిగా వింటూ ఉండేవారు. తన పన్నెండో ఏట తండ్రి ప్రోత్సాహంతో లావుబాలీ దర్గాలో తొలి ప్రదర్శన ఇచ్చాడు. అప్పుడు ఆయనపై ప్రశంసల జల్లు కురిసింది. తర్వాత వెనక్కు తిరిగి చూసుకోలేదు. మరోవైపు మున్సిపల్ హైస్కూల్‌లో ఎస్ఎస్ఎల్‌సీ పూర్తి చేశారు. స్థానికంగా మౌలా మిస్కెన్, గోల్ గుమ్మజ్, ఉస్మానియా కళాశాల మైదానంలో కచేరీలు చేశారు.



టీజీవీ కళాక్షేత్రంలో సత్కారం అందుకుంటున్న న్యామతుల్లా

మలుపు తిప్పిన ఉద్యోగ జీవితం...

పాతనగరంలోని మాసుంబాషా దర్గాలో గాలిబ్ గజల్స్ పాడుతుండగా ఆ కార్యక్రమానికి యాదృశ్చికంగా విచ్చేసిన నాటి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) ఏజీఎం చల్లాదురై హాజరయ్యారు. ఆ కచేరీ పూర్తయ్యాక సంగీత ప్రియుడైన ఆయన న్యామతుల్లాకు కబురు చేసి, తన వద్దే సెక్యూరిటీ ఇన్‌ఛార్జి ఉద్యోగం ఇప్పించారు. అలా ఆయన కూడా న్యామతుల్లా పాటలు వింటూ గడిపేవాడు. అక్కడే పనిచేస్తున్న హనుమంతరావు అనే హిందూస్థానీ సంగీత విద్వాంసునితో న్యామతుల్లాకు పరిచయం పెరిగింది. దీంతో ఆయన హిందూస్థానీ సంగీతాన్ని న్యామతుల్లాకు బోధించడంతోపాటు, తబలా వాయిద్యంలో ఉస్తాద్ (మాస్టర్)గా మార్చేశారు. అలా ఇరువురూ ఎఫ్‌సీఐ దేశవ్యాప్తంగా నిర్వహించే అనేక సాంస్కృతిక ప్రదర్శనలకు వెళ్లి బహుమతులు తెచ్చి నాటి ఎఫ్‌సీఐ జిల్లా శాఖ ఖ్యాతిని నేల నాలుగు చెరగులా చాటి చెప్పారు.

భావి తరాలకు శిక్షణ అందించాలని ఉంది



మారుతున్న కాలంలో ఖవ్వాలీ పాటలు యువతరానికి దూరమౌతున్నాయి. మరో ఇరవై ఏళ్లు పోతే ఈ ఖవ్వాలీ ప్రక్రియ కూడా పూర్తిగా తెరచాటుకు వెళ్లిపోయే ప్రమాదం ఉంది. అందుకే ప్రభుత్వం కానీ, స్వచ్ఛంద సంస్థలు కానీ అవకాశం కల్పిస్తే పది మందికి నేర్పించాలని ఉంది. ఖవ్వాలీ గొప్ప కళాప్రక్రియ. ఇది ఆధ్యాత్మిక భావాలతోపాటూ మనిషికి ప్రశాంతతను ఇచ్చే గొప్ప సంగీత, గాత్ర లయ విన్యాసం. ఉత్తరాది రాష్ట్రాల్లో అక్కడక్కడా ప్రోత్సాహం ఉంది. దక్షిణాదిలోనూ ఈ కళను పదికాలాలు బతికించాలని కోరుకుంటున్నా.

- ఉస్తాద్ న్యామతుల్లా

దేశ వ్యాప్తంగా మూడు వేలకు పైగా కచేరీలు...

ఒకవైపు ఉద్యోగం కొనసాగిస్తూనే న్యామతుల్లా దేశవ్యాప్తంగా హిందూస్థానీ సంగీత కచేరీలు చేసేవారు. అలాగే తన ఖవ్వాలీ బృందంతో కలిసి సుమారు మూడు వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. ఢిల్లీలో తబలా విద్వాంసుడు, దివంగత ఉస్తాద్ జాకీర్ హుసేన్ ముందు తన తబలా ప్రదర్శన చేసి ఆయన ప్రశంస లు అందుకున్నారు. అలాగే ప్రస్తుత సంగీత ప్రపంచంలో రారాజుగా ఖ్యాతి గాంచిన ఏఆర్ రహమాన్ ముందు కూడా అనేక హిందుస్థానీ రాగాల కు తబలా వాయిద్యం ద్వారా ప్రదర్శనలు ఇచ్చి ఆయనకు సన్నిహితుడుగా పేరు తెచ్చుకున్నారు. అలాగే 1980 వరకు ఆకాశవాణిలో ప్రదర్శనలు ఇచ్చారు. అలాగే కేరళ, చెన్నై, బెంగుళూరు, ముంబాయి తదితర ప్రాంతాల్లో జరిగిన ఆంధ్ర మహాసభల్లోనూ తన కచేరీలతో ప్రశంసలు అందుకున్నారు. న్యామతుల్లా ప్రతిభకు పురస్కారాలు ఎన్నో లభించాయి. అనేక చోట బంగారు, వెండి మెడల్స్‌తోపాటు అనేక పురస్కారాలు అందుకున్నారు. వివిధ కళా సంస్థలు ఆయనకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులతో ఘనంగా సత్కరించాయి.

జలం లేని జీవం

జలమే జీవనాధారమైతే
మరి మా జీవితాలు
ఎలా సాగుతున్నాయి...?
వర్షం మొహం చాటేటి
దిశ మార్చుకొని పోతుంది

నాయకులూ అంతే...
ఉపన్యాసాల ధారలు
కురిపించి తడిపేస్తారు...
ఐనా తడిలేని వారి మాటల్లో
తేమలేని మా బతుకులు
ఎప్పటికి తెల్లవారేను...??

నదులనానుకొని సంస్కృతి
పుడమిలో ప్రభవిస్తుందంటారే
మరి ఏమి చూసుకొని
మా జీవితాలు వికసిస్తాయి..?
అవెప్పుడు తిరిగి
పరిమళిస్తాయి..?
నెర్రెలు మోడుతున్న నేలలు
పచ్చదనాన్ని మరచిన
రైతన్నల నేత్రాలు
రంగుల కలలు ఎలా
కంటాయి..?

ఎండిన జీవితాలు
పచ్చగా మారేదెప్పుడో
మరి
కరువు మా
ముఖచిత్రంగా
వలసలే మా గమనంగా
అగమ్యగోచరమైన
భవిషత్తు
తరువాతి తరానికి
కానుకగా ఇవ్వవలసిందేనా...?
కనుచూపు మేర కనబడని
ఏ కారుమేఘమొచ్చి
తీరుస్తుంది
మా బతుకుల
వెతలు...??




- జంధ్యాల రఘుబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సాహితీ స్రవంతి.

తుంగభద్ర సాహిత్యం



సీమ ప్రజల సామాజిక జీవనమే సీమ రేగడి కథలు



కర్నూలు కల్చరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాయలసీమ ప్రాంతానికి ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. యాస, భాష, జీవన విధానాలన్నీ ఇతర ప్రాంతాలతో పోలిస్తే భిన్నంగా కనిపిస్తాయి. తరతరాల ఆచారాలు, సాంస్కృతిక వ్యవహారాలు ఇతరులకు భిన్నంగా కనిపించినా ఇది ఈ ప్రాంత జనజీవనంలో ఒక భాగమైపోయింది. ఈ నేపథ్యాన్ని తీసుకొనే కర్నూలుకు చెందిన ప్రముఖ రచయిత, గొరెడ్డి హరిశ్చంద్రారెడ్డి కథలు రాస్తున్నారు. అలా ఆయన రాసిన కథల్లో ఆణిముత్యాల్లాంటి తొమ్మిది కథలను 'సీమ రేగడి కథలు' పేరుతో పుస్తకాన్ని ముద్రించారు. రాయలసీమలో పూర్వపు రోజుల్లో ప్రబలే అంటు వ్యాధుల నివారణకు ఊళ్లకు ఊళ్లే స్వీయ నిర్బంధం (కరోనా సమయంలో లాక్‌డౌన్‌లా) ప్రకటించుకునేవి. అంతేకాదు, ఆ నిర్బంధాన్ని పక్కాగా పాటిస్తూ ఆ విపత్తులను సమష్టిగా ఎదుర్కొనేవారు. ఆనాటి ఆ పరిస్థితిని కళ్లకు కట్టినట్లు 'పొత్తి' కథ ద్వారా చూపించారు. నేటి ఆధునిక కాలంలో కరోనా సమయంలో పాటించిన లాక్‌డౌన్ వంటి కార్యక్రమాలను వందల ఏళ్లనాడు సీమ ప్రజలు పెద్ద చదువులు లేకుండా కఠినంగా అమలు పరిచి తమను తాము కాపాడుకునే సామాజిక అంశాన్ని రచయిత సునిశితంగా తెలియజేశారు. అలాగే ఆరోజుల్లో మెలకసీమ పల్లెల్లో టిఫినుకు పావు విస్తరి, నడిగడ్డ పల్లెల్లో సగం విస్తరి, రాయలసీమ పల్లెల్లో పూర్తి విస్తరి వేస్తారని చెబుతూ 'పెండ్లి' కథలో తెలియజేస్తారు. వయసుకు వచ్చిన కూతురు తన పనివాడితో చనువుగా ఉండటాన్ని చూసిన తండ్రి తప్పుడు కేసు పెట్టి పగతీర్చుకోవడం సాధారణ కథలాగే అనిపించినా ఈ కథను నడిపించే విధానంలో ఆద్యంతం ఆసక్తికరంగా 'ఓ పనోడి కథ'ను రచయిత రాశారు. కన్న ఊరు చింతలను తీర్చడానికి ప్రాణాన్ని పణంగా పెట్టిన ఓ యువకుని సాహసగాథగా 'పొలిముద్ద కథ' నిలుస్తుంది. పండిన పంటను ఇంటికి చేర్చే క్రమంలో రైతుల కడగండ్లను, కష్టాలను పడరాని పాట్లను 'ఆరుతడి' కథలో కానవస్తుంది. దక్కే కాస్త సుఖం కోసం కొండంత బాధను అనుభవించాల్సి ఉంటుదని, తప్పుడు మార్గాల్లో లభించే సుఖం ఎన్నటికైనా ప్రాణంపైకి తెస్తుందని 'సౌఖ్యం' కథ తెలియజేస్తుంది. పెద్దరికం పేరుతో ఒంటరి అయిన ఓ తండ్రి, తిరిగి మారిపోయి తన కూతురి ప్రేమను అంగీకరించి తిరిగి సంతోషాన్ని ఇంటికి తెచ్చుకున్న వైనం 'సీమ సూర్యుడు' కథలో చూస్తాం. మాటల గారడీతో సమాజంలోని అమాయకులను మోసం చేసే వారు ఎందరో, అలాంటి వారి కథే 'వృద్ధ జంబూకం'. సీమ రేగడి కథలు పుస్తకంలో కథలన్నీ ఆద్యంతం హృద్యంగా సాగుతూ ఏకబిగిన చదివిస్తాయి. కల్పనకు తావు ఇవ్వకుండా వాస్తవ అంశాలను జోడిస్తూ అద్భుతమైన కథలను రచయిత పాఠకులకు అందించారు. ఈ కథలు చదవితే గతకాలపు ఈ ప్రాంత స్థితిగతులు, ఒకనాటి ఉమ్మడి రాష్ట్రంలో తుంగభద్ర నదికి ఆవల ఉన్న తెలంగాణ ప్రాంత రైతుల జీవన స్థితిగతులు, అక్కడక్కడా సీమ, తెలంగాణా ప్రాంత మాండలిక పద ప్రయోగాలు, సామెతలను రచయిత తన కథల్లో చొప్పి ఆ కథలకు మరింత సొబగులు దిద్దారు. ఈ పుస్తకం అన్ని పుస్తక విక్రయశాలల్లో లభిస్తుంది.



- బి. రాణి లీలావతి, నగర అధ్యక్షురాలు, అరసం, కర్నూలు

కవితలకు ఆహ్వానం



'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**

నేడు సముద్ర శాస్త్రవేత్త ఎంపీఎం రెడ్డి సంస్మరణ సభ



కర్నూలు కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన సుప్రసిద్ధ సముద్ర శాస్త్రవేత్త డాక్టర్ ఎంపీఎం రెడ్డి సంస్మరణ సభ ఆదివారం ఉదయం 10:30 గంటలకు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసినట్లు తెలుగు కళా సమితి అధ్యక్షుడు ఎస్ఎండీ ఇనాయతుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు బనగానపల్లె అరుణ భారతి సంస్థ అధ్యక్షులు బీసీ రాజారెడ్డి, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు విద్వాన్ పత్తి ఓబులయ్య, డాక్టర్ ఎం.మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. తెలుగు కళా స్రవంతి ఆధ్వర్యంలో జరిగే ఈ సంస్మరణ సభకు సాహితీ మిత్రులందరూ పాల్గొని డాక్టర్ ఎంపీఎం రెడ్డికి నివాళులు అర్పించాలని ఇనాయతుల్లా విజ్ఞప్తి చేశారు.

భారీ ధర పలికిన పొట్టేళ్లు

అన్న రూ.80 వేలు, తమ్ముడు రూ.90 వేలకు కొనుగోలు



రూ.90 ,రూ.80 వేలకు కొన్న పొట్టేళ్లను చూపుతున్న గోవిందు



దేవనకొండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఓ రెండు పొట్టేళ్లు భారీ ధర పలికాయి. ఒకటి రూ.90 వేలు తీసుకోగా మరొకటి రూ.80 వేలు పలికాయి. గద్దెరాళ్ల దేవర కోసం పల్లెదొడ్డికి చెందిన హనుమంతు, రామాంజిని అన్నదమ్ముల కుమారులు గోవిందు తెలంగాణలోని ఐజ సంతలో రూ.90 వేలకు ఓ పొట్టేలు కొన్నాడు. అన్న కౌలుట్ల కర్ణాటకలోని బళ్లారి సంతకు వెళ్లి రూ.80 వేలకు పొట్టేలు కొన్నాడు.



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు





పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు



శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు

అమరావతిలో.. శ్రీవారి కల్యాణోత్సవం

రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు



వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు



సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు

కట్టలు కట్టలే..!

(5వ పేజీ తరువాయి)

- జూపాడుబంగ్లా మండలానికి చెందిన ఓ వ్యక్తి రిజిస్ట్రేషన్ కోసం గత వారంలో నందికొట్కూరు కార్యాలయానికి వెళ్లారు. వెంటనే స్టాంప్ చలానా రూ.60 వేలు తీయమన్నారు. ఆ తర్వాత అదనంగా ఓ రైటర్ రూ.20 వేలు తీసుకున్నారు. ఇలా నిత్యం అక్కడ సిబ్బంది.. కొందరు రైటర్లు కుమ్మక్కై అధిక వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిసింది. కింది స్థాయి సిబ్బందిలో ఒకరు సాయంత్రం కాగానే వసూళ్లు చేసుకొచ్చి అందజేస్తున్నట్లు తెలిసింది.
- బనగానపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ముడుపులు ఇస్తే తప్ప పనులు జరగడం లేదని తెలుస్తోంది. ఎవరైనా నేరుగా వెళ్తే వివిధ రూపాల్లో కొర్రీలు విధిస్తున్నారని సమాచారం. ముడుపులు చెల్లిస్తే ఆ తర్వాత సాఫీగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని బాధిత వర్గాల ఆవేదన. ఒక్కొక్క రిజిస్ట్రేషన్‌కు రూ.3 నుంచి రూ.5 వేలు బయటి వ్యక్తులను ఏర్పాటు చేసుకుని వసూలు చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఇదే కార్యాలయంలో పని చేసిన ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు సస్పెండైనా అవినీతి అక్రమాలు మాత్రం ఆగడం లేదు.
- అవుకు, కోవెలకుంట్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో రిజిస్ట్రేషన్లు ఆశాజనకంగానే సాగుతున్నాయి. అవుకులో అయితే డాక్యుమెంట్ రైటర్లు రెండు వర్గాలుగా విడిపోయి సాయంత్రం కాగానే జరిగిన వసూలు చేసిన మామూళ్లను సంబంధిత అధికారికి ముట్టచెప్పుతారని సమాచారం. గతంలో ఇక్కడ ఓ జూనియర్ అసిస్టెంట్ ఏసీబీ వలకు చిక్కారు.
- డోన్ సబ్ రిజిస్ట్రార్ తీరుపై పలు రకాల అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఏ పని కోసం వచ్చినా పైసలు ఇవ్వందే పని చేయరనే విమర్శలు ఉన్నాయి. ఇక్కడ 15 మంది డాక్యుమెంట్ రైటర్లు ఉండగా వీరిలో ఒక డాక్యుమెంట్ రైటర్ ద్వారా సదరు సబ్ రిజిస్ట్రార్ లోగుట్టు వ్యవహారం నడిపిస్తున్నారని తెలిసింది. రోజువారిగా జరిగిన రిజిస్ట్రేషన్ల పరంగా సదరు డాక్యుమెంట్ రైటర్ మిగిలిన వాళ్లతో వసూలు చేసుకొని వచ్చి సదరు అధికారికి అందజేసే విధంగా వ్యవహారం సాగుతోందని ఆరోపణలున్నాయి.
- ప్యాపిలిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో ఇద్దరు డాక్యుమెంట్ రైటర్లు ఉన్నారు. సదరు కార్యాలయంలో ఏ పని కావాలన్నా సదరు డాక్యుమెంట్ రైటర్లను కలిస్తేనే పని జరుగుతుందనే ప్రచారం లేకపోలేదు. అక్కడ ఉద్యోగుల నోటి నుంచి కూడా ఇదే పదం రావడం గమనార్హం. ఆ ఇద్దరు డాక్యుమెంట్ రైటర్లు ఏ రోజుకారోజు జరిగిన క్రయ విక్రయాల పరంగా వచ్చిన మొత్తాన్ని ఇంటికి వెళ్లే సమయంలో ఓ అధికారికి అందజేస్తున్నారని సమాచారం.
- ఆళ్లగడ్డ, బండిఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొందరు బయటి వ్యక్తులు సభ్యులుగా ఏర్పడి రిజిస్ట్రేషన్లలో అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. కొందరు బయటి వ్యక్తులతో పాటు ఒకరిద్దరు డాక్యుమెంట్ రైటర్లు క్రయ,విక్రయదారులతో ముందుగానే డబ్బు వసూలు చేసి కార్యాలయ పనివేళలు ముగియగానే పంపకాలు చేస్తున్నట్లు పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. ఎవరైనా అడిగినంత ఇవ్వకపోతే వారి డాక్యుమెంట్లు ముందుకు కదలవు. రిజిస్ట్రేషన్లు సైతం ఆలస్యంగా జరుగుతాయన్న ఆరోపణలున్నాయి.

కాపు కాసి.. కారం కొట్టి..

- వేటకొడవళ్లతో నరికి అతి దారుణంగా హత్య
- కాపాడబోయిన ఓ మహిళపైనా దాడి
- సంజన్న మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి
- అంజి వర్గీయుల కోసం పోలీసుల గాలింపు
- బాధిత కుటుంబానికి ఎంపీ శబరి, గౌరు వెంకటరెడ్డి పరామర్శ


మృతుడు సంజన్న (ఫైల్)

కర్నూలు క్రైం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శరీన్‌నగర్‌లో జరిగిన టీడీపీ నాయకుడు సంజన్న హత్య కేసులో పలు కోణాలు వెలుగులోకి వచ్చాయి. శుక్రవారం రాత్రి 9:30 గంటల ప్రాంతంలో జరిగిన ఈ హత్యపై పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టారు. శనివారం మార్చురీ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సంజన్న మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తుండటంతో సంజన్న వర్గీయులు పెద్దఎత్తున మార్చురీ వద్దకు చేరుకున్నారు. అంజి వర్గీయులను వెంటనే ఉరి తీయాలని డిమాండ్ చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో పోలీసులు 24 గంటల్లో అరెస్టు చేస్తామని చెప్పడంతో వివాదం సద్దుమని గింది. అనంతరం సంజన్న మృతదేహానికి ఆసుపత్రి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పగించారు.

కాపాడబోయిన ఓ మహిళ

సంజన్నకు సుపరిచితురాలైన పాతిమాబేగం అనే మహిళ ఆ సమయంలో అక్కడే ఉంది. ఈమె కూడా సంజన్నతో పాటు కరాటేలో శిక్షణ తీసుకున్నారు. ముందుగానే గుంపులు గుంపులుగా ఉన్న వారిని గుర్తించిన ఆమె సంజన్నను అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ కోరారు. అయితే సంజన్న పెద్దగా పట్టించుకోలేదు. సంజన్నపై అంజి వర్గీయులు దాడి చేయగానే ఈమె అడ్డుపడింది. సంజన్న కింద పడిపోగానే మీద అడ్డంగా పడి కాపాడబోయే ప్రయత్నం చేసింది. దీంతో అంజి వర్గీయులు ఆమెపై కూడా దాడి చేశారు. చేతిలో ఉన్న కర్రలతో ఆమెను తీవ్రంగా కొట్టారు. ఓ నిందితుడు ఆమెపై కత్తితో దాడి చేయబోగా కాలితో తన్నడంతో కత్తి కాలికి గుచ్చుకొని గాయమైంది. సంజన్నను కాపాడేందుకు ఆమె తీవ్రంగానే ప్రతిఘటించినట్లుగా తెలుస్తోంది. ఈ సన్నివేశాన్ని కరీం బాషా అనే వ్యక్తి సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా అంజి వర్గీయులు ఆ సెల్‌ఫోన్‌ను లాక్కున్నారు. ఇంతలో సంజన్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అంజి వర్గీయులు సంజన్న కొడుకులపై కూడా కత్తితో దాడి చేయబోయారు. ఆయన భార్య లక్ష్మీదేవిని పక్కకు తోసేశారు. సంజన్న చనిపోయాడని తెలుసుకుని అక్కడి నుంచి కార్లలో పరారయ్యారు. స్థానిక హ్యాంగవుట్ హోటల్ వద్ద అంజి వర్గీయులు ఉపయోగించిన కారును గుర్తించారు. కారులో సమస్య రావడంతో అక్కడే వదిలేసి వెళ్లిపోయినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు.

ఎంపీ శబరి, గౌరు పరామర్శ..

నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి సంజన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. శనివారం ఉదయం మార్చురీ వద్దకు చేరుకుని ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే టీడీపీ సీనియర్ నాయకుడు నందికొట్కూరు నియోజ కవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సంజన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. జరిగిన సంఘటనపై అడిగి తెలుసుకున్నారు.

ముందస్తు ప్రణాళికతోనే..

సంజన్న ప్రతి శుక్రవారం మెడిటేషన్ సెంటర్‌కు వస్తాడనీ అంజి వర్గీయులు ముందుగానే గుర్తించారు. అయితే.. రాత్రి వేళలో ఒంటరిగా దొరుకుతాడని, ఆ సమయంలో అంతమొందించాలని ప్లాన్ చేసుకున్నట్లు తెలుస్తోంది. మెడిటేషన్ సెంటరు దగ్గరలోనే అంజి ఇల్లు కూడా ఉంది. శుక్రవారం రాత్రి 12 నుంచి 15 మంది రెండు కార్లలో కారం పొడి, వేటకొడవళ్లు సిద్ధం చేసుకొని సంజన్నను అంతమొందించడానికి ప్రణాళిక వేసుకున్నట్లు సమాచారం. సంజన్న మెడిటేషన్ సెంటరు వద్దకు చేరుకోగానే అప్పటికే కాపు కాసిన వీరంతా సంజన్నపై దాడి చేశారు. ముందుగా కళ్లలో కారం కొట్టి ఆయన సెంటరులోకి వెళ్లక ముందే వేటకొడవళ్లతో అతికిరాతకంగా నరికారు. ఆ సమయంలో ఆ ప్రాంతంలో నలుగురైదుగురు వృద్ధులు మాత్రమే ఉన్నారు. వారిని కూడా కత్తులు చూపించి బెదిరించినట్లుగా సమాచారం.

కేసు నమోదు...

సంజన్న కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వడ్డె రామాంజనేయులు అలియాస్ అంజి, ఆయన కొడుకులు వడ్డె కుమార్, శివ, రేవంత్‌లతోపాటు భార్య, అల్లుడు, మరికొంత మీద పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరితో పాటు 29వ కార్పొరేటర్ సుదర్శన్ రెడ్డి, శివారెడ్డి పేర్లను కూడా ఆ ఫిర్యాదులో ప్రస్తావించినట్లుగా సమాచారం. నిందితులపై బీఎన్ఎస్-189(4), 191(2), 118(1), 103(1), (2) /రెడ్‌విత్ 190 సెక్షన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు కూడా నమోదు చేసినట్లుగా పోలీసులు తెలిపారు. మార్చురీ వద్ద డీఎస్పీ బాబుప్రసాద్, సీఐలు రామయ్య నాయుడు, తబ్రేజ్, ఎస్ఐలు గోపినాథ్, చంద్రశేఖర్ రెడ్డి, మన్మథ విజయ్‌లు ఏఆర్ స్పెషల్ పార్టీ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రత్యేక బృందాలతో గాలింపు

సంజన్న హత్య కేసులో నిందితులుగా ఉన్న అంజి వర్గీయుల కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని డీఎస్పీ బాబు ప్రసాద్ తెలిపారు. నలుగురు సీఐల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు నిందితుల కోసం గాలిస్తున్నాయని, అలాగే పికెట్‌లో రెండు బృందాలతో బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు.

భార్యను హత్య చేసిన భర్త

నందికొట్కూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): భర్త చేతిలో భార్య హత్యకు గురైన ఘటన నందికొట్కూరు పట్టణంలోని బైరెడ్డి శేషశయనారెడ్డి నగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. మొల్ల అబ్దుల్లా(26), నజీమూన్(21) కొంత కాలంగా పట్టణంలో జీవిస్తున్నారు. బండి ఆత్మకూరుకు చెందిన పటాన్ అలీబాషా కుమార్తె నజీమూన్‌కు గడివేముల మండలం మంచాలకట్ట గ్రామానికి చెందిన మొల్ల అబ్దుల్లాతో రెండున్నరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి 14 నెలల కూతురు ఉంది. మొల్ల అబ్దుల్లా తాపీమేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. నజీమూన్ తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడటాన్ని అబ్దుల్లా తల్లి రఫియాబీ అనుమానం కలిగే విధంగా మాటలు చెప్పి తరచూ నజీమూన్‌ను కొట్టించేది. శుక్రవారం సాయంత్రం ఆమె ఫోన్‌లో మాట్లాడుతుండడంతో ఇద్దరు భార్యభర్తలు గొడవ పడ్డారు. అబ్దుల్లా ఆమెను కర్రతో చితకబాదడంతో కిందపడిపోయింది. తలకు బలమైన గాయం కావడంతో తీవ్రగాయాల పాలవగా నందికొట్కూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో డాక్టర్లు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులకు అబ్దుల్లా సమాచారం ఇచ్చాడు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ పరిశీలించారు. నాజీమూన్ తండ్రి పటాన్ అలీబాషా ఫిర్యాదు మేరకు మొల్ల అబ్దుల్లా, అతడి తల్లి మొల్ల రఫియాబీలపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.


కుటుంబ సభ్యులతో నజీమూన్ (ఫైల్)

దాడి కేసులో నిందితుల అరెస్టు


నిందితులను చూపుతున్న డీఎస్పీ, సీఐ, పోలీసులు

కోవెలకుంట్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కంపమల్ల గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు సోమల లోకేశ్వర్‌రెడ్డిపై జరిగిన దాడి కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ కె.ప్రమోద్ తెలిపారు. శనివారం కోవెలకుంట్ల సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రమోద్ మాట్లాడుతూ వైసీపీకి చెందిన సోమల లోకేశ్వర్‌రెడ్డి, టీడీపీకి చెందిన సూర చిన్నసుబ్బారెడ్డిలపై కేసు నమోదు చేశామన్నారు. 2019 నుంచి 2024 వరకు రెండున్నర సంవత్సరాలు లోకేశ్‌రెడ్డి సర్పంచ్‌గా పని చేశాడని తెలిపారు. ఇటీవల టీడీపీకి చెందిన చిన్నసుబ్బారెడ్డి వర్గీయులను రెచ్చగొట్టే విధంగా లోకేశ్‌రెడ్డి అనుచరులు మాట్లాడారని, దీంతో సుబ్బారెడ్డి వర్గీయులు ఇనుపరాడ్లను తీసుకుని సోమల లోకేశ్ ఇంటిపై దాడి చేశారని అన్నారు. ముందుగా వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డిని కొట్టి గాయపరిచారని తెలిపారు. తరువాత వెంకటేశ్వర్‌రెడ్డి ఇంట్లో ఉండగా ఇంట్లో రెండు డోర్లను పగలగొట్టి వెంకటేశ్వర్లుపై దాడి చేసి గాయపరిచారని, అంతలో లోకేశ్‌రెడ్డి పొలం నుంచి ఇంటికి రాగా అతనిపైనా దాడి చేసి గాయపర్చారని అన్నారు. లోకేశ్‌రెడ్డి స్పృహ తప్పగా అతని తమ్ముడు వెంకటేశ్వర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొమ్మిది మందిపై కేసు నమోదు చేశామని చెప్పారు. అందులో సూరచిన్నసుబ్బారెడ్డి, సోమల లక్ష్మీనారాయణరెడ్డి, సూర సురేష్ కుమార్‌రెడ్డి, సూర రవికుమారరెడ్డి, షేక్ సుభాన్, రావిడ్డిగారి వెంకటసుబ్బారెడ్డిలను శనివారం ఆళ్లగడ్డ రోడ్డులోని కంపమల్ల మెట్ట వద్ద కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారని తెలిపారు. వారి వద్ద నుంచి ఇనుపరాడ్లను స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని చెప్పారు. త్వరలోనే వారిని కూడా అరెస్టు చేసి రిమాండుకు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల సీఐ హనుమంతనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యశాఖను బలోపేతం చేస్తాం

- కమిషనర్ రాంశంకర్ నాయక్


కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అపారమైన మత్స్య సంపద కలిగి ఉన్న మత్స్యశాఖను మరింత బలోపేతం చేస్తామని ఫిషరీష్ శాఖ కమిషనర్ రాంశంకర్ నాయక్ వెల్లడించారు. శనివారం ఆయన కర్నూలు నగరంలోని మత్స్య శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. మత్స్యశాఖ అభివృద్ధి అధికారులు, ఎన్జీవోలు, గ్రామ స్థాయి సిబ్బంది జిల్లా ప్రోగ్రాం మేనేజర్లతో సమావేశాన్ని నిర్వహించారు. శాఖాపరమైన లక్ష్యాలు, సాధించిన పురోగతి, ఆక్వాకల్చర్, కిసాన్ క్రెడిట్ కార్డ్స్, అలంకరణ చేపల పెంపకంతో పాటు ఎన్‌హెచ్‌డీపీ, ఈశ్రమ్ వెబ్ పోర్టల్‌లో మత్స్యకారుల నమోదు ప్రక్రియ, సంఘాల్లో నూతన సభ్యులను చేర్పించడం ఎఫ్ఎఫ్‌పీవో, ఇతర అంశాల గురించి చర్చించారు. వీటి లక్ష్యాల సాధనకు తగు సూచనలు చేశారు. సమావేశం అనంతరం రాయలసీమ మత్స్యశిక్షణ కేంద్రమైన కర్నూలులో శిక్షణా పొందుతున్న వారికి సూచనలు ఇచ్చారు. జిల్లా మత్స్యకార సభ్యులతో ప్రాథమిక మత్స్య సహకార సభ్యులతో, మహిళా మత్స్య సహకార సభ్యులతో మార్కెటింగ్, చేపల వినియోగం, సంగాల బలోపేతం గురించి చర్చించారు. అనంతరం నగరంలోని కింగ్ మార్కెట్ వద్ద ఉన్న చేపల మార్కెట్‌ను సందర్శించి స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌పై కార్మికులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా బంగారుపేట, సుంకేసుల, గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద ఉన్న చేప పిల్లల పెంపకం కేంద్రాలను పరిశీలించారు. మత్స్యశాఖ జిల్లా జేడీ శ్యామల, ఎఫ్‌డీవోలు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

శ్రీశైలంలో నకిలీ ఆన్‌లైన్ వెబ్‌సైట్!

శ్రీశైలం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో శనివారం నకిలీ ఆన్‌లైన్ వెబ్‌సైట్ కలకలం లేపింది. శ్రీశైలం దేవస్థానం మల్లికార్జున సదన్ పేరుతో ఉన్న నకిలీ వెబ్‌సైట్‌లో హైదరాబాదుకు, ముంబయికి చెందిన ఇద్దరు భక్తులు రూమ్స్ బుక్ చేసుకున్నారు. శనివారం ఉదయం వీరు శ్రీశైలం వచ్చి మల్లికార్జున సదన్‌లో రూముల కోసం వెళ్లగా అక్కడి నిర్వాహకులు స్కాన్ చేసి చూసి నకిలీవని నిర్ధారించారు. దీనితో వారు మోసపోయామని తెలుసుకున్నారు. ఇదివరకే ఇలాంటి నకిలీ వెబ్‌సైట్‌ల గురించి భక్తులకు అవగాహ కల్పించామని, ఇక ముందైనా ఇలాంటి నకిలీ వెబ్‌సైట్‌లను నమ్మవద్దని దేవస్థానం అధికారులు సూచిస్తున్నారు. శ్రీశైలం దేవస్థానం.ఒఆర్‌జీలో మాత్రమే అకామిడేషన్, సేవా టికెట్లు బుకింగ్ అవుతాయని చెబుతున్నారు.

శ్రీశైలంలో మద్యం పట్టివేత

శ్రీశైలం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం పరిధిలోని కొత్తపేటలో ఓ వ్యక్తి నుంచి మద్యం బాటిళ్లను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. శ్రీశైలం గ్రామానికి చెందిన మేకల శ్రీనాథ్ (31) అనే వ్యక్తి మద్యం అమ్ముతునట్లు సమాచారం అందడంతో స్టిబందితో కలిసి వారిని అదుపులోకి తీసుకున్నామని సీఐ ప్రసాద్‌రావు తెలిపారు. వారి వద్ద నుంచి 25 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు.

146 సూపర్ స్పెషలిస్టుల కోసం వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

కర్నూలు హాస్పిటల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో ఖాళీగా ఉన్న 146 సూపర్ స్పెషలిస్టు పోస్టుల భర్తీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ నరసింహం పోస్టులకు సంబంధించి ఈ నెల 24వ తేదీ వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వేతనాలు విద్యార్హత వివరాలను http:dme.ap.nic.in వెబ్‌సైట్‌లో ఉన్నాయని తెలిపారు. అర్హత గలిగిన వైద్యులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సిటీ సర్జరీ 15, కార్డియాలజీ 15, ఎండోక్రైనాలజీ 5, గ్యాస్ట్రో ఎంట్రాలజీ 9, మెడికల్ అంకాలజి 16, న్యూరోసర్జరీ 16, న్యూరాలజీ 13, ప్లాస్టిక్ సర్జరీ 4, పీడియాట్రిక్ సర్జరీ 5, సర్జికల్ అంకాలజి 14, యురాలజీ 12, వాస్క్యులర్ సర్జరీ 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు న్యూసిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి మంత్రులు, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అధికారులు, ఎంపీలు, శాసన సభ్యులు హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. ముందుగా జడ్పీ మినీ సమావేశ భవనంలో ఒకటో స్థాయి సంఘ సమావేశం ఉదయం 9:30 గంటలకు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

లీజుకు టూరిజమ్ ప్రాజెక్టు

కర్నూలు న్యూసిటీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిధిలోని శ్రీలక్ష్మీ జగన్నాథగట్టు (లక్ష్మీపురం) వద్ద నిర్మించిన ఏపీ టూరిజమ్ ప్రాజెక్టును లీజుకు ఇవ్వనున్నట్లు జిల్లా పర్యాటక అధికారి విజయ శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టులో భాగంగా డార్మిటరీ, పార్క్, కెఫిటేరియా, టాయిలెట్ బ్లాక్, సెక్యూరిటీ గార్డ్, ప్రవేశ రుసుము వసూలు చేసుకునేందుకు 10 సంవత్సరాల కాల పరిమితి ఉందన్నారు. ఈ నెల 17 నుంచి 21 వరకు సాయంత్రం 4 గంటలలోపు టెండరు దరఖాస్తులను కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తు ఏపీ టూరిజమ్ కార్యాల యంలో సమర్పించాలన్నారు. వివరాలకు 6309942034, 8247704152కు సంప్రదించాలని కోరారు.

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

ఆదోని, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ ప్రేమజంట శనివారం రాత్రి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన మేరకు.. బళ్లారి జిల్లా గోనెహాల్ గ్రామానికి చెందిన మౌలా అనే యువకుడు బాదామికి చెందిన అనూష అనే యువతి ప్రేమించుకున్నారు. వీరి ప్రేమకు ఒప్పుకోని తల్లిదండ్రులు అనూషకు వేరే వ్యక్తితో వివాహం జరిపించారు. అయినా వీరు ఫోన్‌లో మాట్లాడేవారు. ప్రేమికుడిని మరిచిపోలేని అనూష ఈ నెల 11న బళ్లారికి వచ్చి ప్రేమికుడితో బైక్‌పై ఆదోనికి వచ్చి, పరిసరాల్లో తిరిగారు. అనూష వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు మౌలా ఇంటికి వెళ్లి ఘర్షణ పడ్డారు. విషయం తెలుసుకున్న ప్రేమజంట తాము కలిసి ఉండలేమని, చావులోనైనా కలిసి ఉండాలని పురుగు మందు డబ్బా తీసుకుని ఇద్దరూ తాగారు. అనంతరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తాము ప్రేమికులమని, పురుగుమందు తాగినట్లు తెలిపారు. పోలీసులు వీరిని హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. కాగా వీరి పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం

'పది' పరీక్షలకు ఉచిత బస్సు ప్రయాణం

కర్నూలు రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు కర్నూలు జిల్లా ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం కె.సుధారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్సు పాస్ లేనప్పటికీ ఒరిజనల్ హాల్‌టికెట్లు కండక్టర్‌కు చూపిస్తే ఉచిత ప్రయాణానికి అనుమతి ఇస్తారన్నారు. పల్లెవెలుగు (ఆర్డీనరి), అల్ట్రా పల్లెవెలుగు (ఆర్డీనరీ) బస్సుల్లో తమ నివాస స్థానం నుంచి పరీక్ష కేంద్రం వరకు తీసుకెళ్తారన్నారు.

రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపండి

- జిల్లా ఇన్‌చార్జి అధికారి కాంతిలాల్‌దండే


మాట్లాడుతున్న అధికారి కాంతిలాల్ దండే

కర్నూలు కలెక్టరేట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముఖ్యమైన రోడ్ల నిర్మాణాలు అవసరం ఉంటే ప్రతిపాదనలు పంపాలని రహదారులు, భవనాలు, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో రోడ్ల నిర్మాణాలు, ఇతర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, డీటీసీ శాంతకుమారి, నేషనల్ హైవే ఎస్‌డీసీ సునీత పాల్గొన్నారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దాం

జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిద్దామని జిల్లా ఇన్‌చార్జి ఆఫీసర్, రహదారులు, భవనాలు, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్‌దండే పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో చేపడుతున్న ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల అమలుపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ రంజిత్ బాషా, జేసీ నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకటనారాయణమ్మ, సీపీవో హిమప్రభాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

పాములపాడు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సరదాగా మిత్రులతో ఈతకు వెళ్లిన అమూల్యరాజ్ (14) తిరిగి రాని వెళ్లారు. వివరాలివీ.. మండలంలోని గుండాలనట్టు గ్రామానికి చెందిన ఆనందరావు కుమారుడు అమూల్యరాజు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శనివారం స్నేహితులతో కలసి సమీపంలోని తెలుగుగంగ కాల్వలో ఈతకు వెళ్లి మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాలుడి మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వివాహిత ఆత్మహత్య

తుగ్గలి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాంపురం లో రాజేశ్వరి (25) అనే వివాహిత శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లోనే ఉరి వేసుకోగా కుటుంబ సభ్యులు పత్తికొండ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందిందని తెలిపారు. మృతురాలిది తమిళనాడు రాష్ట్రానికి చెందిన క్రిష్ణగిరి జిల్లా ఉత్తరంగై గ్రామం. వెంకటేశ్వర్లు గత రెండేళ్ల క్రితం బతుకుదెరువు కోసం తమిళనాడుకు వెళ్లి పత్తి జిన్నులో పని చేస్తూ రాజేశ్వరితో ప్రేమలో పడ్డాడు. పెళ్లి చేసుకొని ఊరికి తీసుకువచ్చాడు. అయితే భార్యాభర్తలు తరుచూ గొడవ పడుతూ ఉండేవారని, అదే క్రమంలో శుక్రవారం కూడా గొడవ పడ్డారని సమాచారం. జొన్నగిరి పోలీసులు మృతురాలి కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఓర్వకల్లు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన బోయ సాయి (25) అనే యువకుడు శనివారం రాత్రి విద్యుత్ స్తంభానికి తన ద్విచక్రవాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుడు ఉయ్యాలవాడ నుంచి ఉప్పలపాడుకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. ప్రమాదవశాత్తు కరెంటు స్తంభానికి ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. యువకుడి తల్లిదండ్రులు శ్రీనివాసులు, పద్మావతి శోకసంద్రంలో మునిగిపోయారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫుల్ బాటిల్‌కు అలవాటు పడి డైలాగులు

- బైరెడ్డి సిద్దార్థరెడ్డిపై ఎంపీ శబరి విమర్శలు

కర్నూలు క్రైం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఫుల్ బాటిల్‌కు అలవాటు పడి బైరెడ్డి సిద్దార్థరెడ్డి డైలాగులు చెబుతున్నాడని ఎంపీ శబరి అన్నారు. శనివారం మధ్యాహ్నం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 9 నెలలుగా కార్యకర్తలను గాలికి వదిలేసి.. నేడు కార్యకర్తల అరెస్టుల గురించి మాట్లాడే అర్హత రౌడీ నాయకులకు ఉందా అని ప్రశ్నించారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్టు చదవడం, సోషల్ మీడియాలో హల్‌చల్ చేసే వారికి రాజకీయాలెందుకని అన్నారు. జగన్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, నియోజకవర్గాల్లో తిరిగితే విషయం తెలుస్తుందని ఆమె విమర్శించారు. బైరెడ్డి అంటూ తమ కుటుంబం పేరు వాడుకోవడం తగదని అన్నారు. బైరెడ్డి వంశాన్ని కాపాడేది ఎంపీగా తనకే సాధ్యమని చెప్పారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్, డిప్యూటీ సీఎం జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్‌లపై సిద్దార్థరెడ్డి చేసిన వ్యాఖ్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.


మాట్లాడుతున్న ఎంపీ బైరెడ్డి శబరి

హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న కరణం కిషోర్ కుమార్

కర్నూలు అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కులు, చట్టంపై విద్యార్థులకు అవగాహన అవసరమని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు కరణం కిషోర్ కుమార్ అన్నారు. శనివారం కేవీఆర్ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినియోగదారుల హక్కులు, చట్టంపై విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. జిల్లా పౌరసరఫ రాల అధికారి రాజా రఘువీర్, ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కరణం కిషోర్ కుమార్ మాట్లాడుతూ వినియోగదారులు తమ హక్కులను తెలుసుకొని అన్యాయం జరిగినప్పుడు ప్రశ్నిస్తే ప్రశ్నించి వారితోపాటు మిగతా వినియోగదారులకు కూడా న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తూనికలు, కొలత శాఖ ఇన్‌స్పెక్టర్ పరమేష్, అడిషనల్ సప్లయ్ ఆఫీసర్ రామాంజనేయరెడ్డి, కామర్స్ విభాగాధిపతి కె.వెంకటరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన నాలుగో పట్టణ సీఐ

కర్నూలు క్రైం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సెలవులపై వెళ్లిన నాలుగో పట్టణ సీఐ మధుసూదన్‌గౌడు శనివారం రాత్రి తిరిగి విధుల్లో చేరారు. సంజన్న హత్య కేసులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేర కు ఆయన వెంటనే విదుల్లో చేరారు. అలాగే శరీన్‌నగర్ ప్రాంతంలో నాలుగు పికెట్లను ఏర్పాటు చేశారు. ఒక పికెట్‌లో ఎస్ఐ, ఏఆర్ఎస్ఐ, ఆరుగురు కానిస్టేబుళ్లను నియమించారు. అలాగే రెండు బ్లూకోల్ట్స్ టీమ్‌లు నియమించారు. ఆయా పోలీస్ పికెట్లను ఆయన తనిఖీ చేశారు.

విజేతకు సన్మానం

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకు బెంగళూరు కంటిరవ స్టేడియంలో జరిగిన 44వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ కర్నూలు జిల్లాకు చెందిన రిటైర్డు ఏఎస్ఐ బి.పాండురంగారెడ్డి జావె లిన్‌త్రోలో కాంస్య పతకం సాధించారు. శనివారం మాస్టర్ అథ్లెట్స్, డీఎస్ఏ సిబ్బంది మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీజీ చేతుల మీదుగా సర్టిఫికెట్లు మెడల్స్ అందుకున్నారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డిని టీజీ వెంకటేశ్ అభినందించారు.

ఉద్యోగాలకు ఎంపిక

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక కేవీ సుబ్బారెడ్డి ఫార్మసీ కళాశాలలో హైదరాబాదు డీవీసీ ల్యాబోరేటరీ ఆధ్వర్యంలో శని వారం జరిగిన ప్రాంగణ ఎంపికలో 62 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బీఫార్మసీ, ఎం-ఫార్మసీ, బీటెక్ మెకానికల్ విద్యార్థులు మొత్తం 126 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరికి పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ప్రతిభ కనబరిచిన 62 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక చేశారు. హెచ్ఆర్ కే.హరికృష్ణ, కే.శివనవీన్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి, కరస్పాండెంట్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ జీవీ రమణ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంటు ఇన్ చార్జి నిజాముద్దీన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: సీఐ

కర్నూలు క్రైం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ అన్నారు. శనివారం ఎస్పీ ఆదేశల మేరకు డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యం లో నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వక్కేరవాగు దగ్గర ఉన్న ఫంక్షన్ హాలులో నగరంలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను తీసుకెళ్లే బస్సుల ను, ఆటోలు కలిగిన 350 మంది డ్రైవర్లకు రహదారి భద్రత నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలన్నారు. డ్రైవర్లకు డ్రైవింగ్‌లో 5 సంవత్సరాలు అను భవం ఉండాలన్నారు. లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు కలిగి ఉండాల న్నారు.

పిల్లల నైపుణ్యాన్ని పరిశీలించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పిల్లల నైపుణ్యాన్ని పరిశీలించాలని పాఠశాల క్లస్టర్ ప్రిన్సిపాల్ అన్వర్ బాషా అన్నారు. శనివారం స్థానిక మాధవి నగర్‌లోని నారాయణ పాఠశాలలో ప్రిన్సిపాల్ మహ్మద్ ఆల్తాఫ్ ఆధ్వర్యంలో స్టూడెంట్ లీడ్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో ఈకిడ్స్ కోఆర్డినేటర్ అరుణ, వైస్ ప్రిన్సిపాల్ రాధ పాల్గొన్నారు.

ముస్లిం మహిళలకు ఇఫ్తార్


ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లిం మహిళలు

కర్నూలు కల్చరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో ఉపవాసం (రోజా) పాటిస్తున్న ముస్లిం మహిళలకు రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. శనివారం నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో విజన్ కళాశాల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లిం ఉద్యోగులకు మతపరమైన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. కార్యక్రమంలో పూజారి చంద్రశేఖరశర్మ, నాగప్ప, పార్వతమ్మ, తరుణిప్రియ, విశ్వధాబిరామ్, ముస్లిం మైనార్టీ మహిళలు పాల్గొన్నారు.

మజ్జిగ కేంద్రం ప్రారంభం

కర్నూలు అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఎండల నేపథ్యంలో ఇంటర్ పరీక్షలకు హాజరైన విద్యార్థులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ బోయ విజయ కుమార్ నాయుడు అన్నారు. శనవారం సెయింట్ మేరీస్ జూనియర్ కళాశాల, కోల్స్ కళాశాల సమీపంలో విద్యార్థులు చేపట్టిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మజ్జిగ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విద్యార్థులు బి.కిరణ్ కుమార్, కే.కమలాకర్‌రెడ్డి, షేక్ అలిహు సేన్, ఆధ్యాపకులు నాగచంద్రుడు, శివప్రసాదరెడ్డి, కే.చిన్నయ్య పాల్గొ న్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో విద్యుత్ సరఫరాలో ఆదివారం అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ ఈఈ టి.శేషాద్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సెంట్రల్ సెక్షన్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ సెక్షన్, బీ.క్యాంపు సెక్షన్, కల్లూరు సెక్షన్, కర్నూలు రూరల్స్ సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

- అర్ధరాత్రి లక్ష్మీమాధవుల కల్యాణం
- పెళ్లి పెద్దలుగా రెండు గ్రామాల ప్రజలు
- గరుడ సేవకు ముమ్మరంగా ఏర్పాట్లు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీమాధవస్వామి

కోడుమూరు రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరంట్లలో లక్ష్మీమాధవస్వామి బ్రహ్మోత్సవాలు నయనానందకరంగా సాగుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచి మాధవుడి కల్యాణ క్రతువు మొదలు కానుంది. ఈ వేడుకను తిలకించేందుకు పరిసర గ్రామాల ప్రజలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వస్తారు. కల్యాణం అనంతరం నిర్వహించే గరుడసేవను వీక్షించి తరిస్తారు. శుక్రవారం అర్ధరాత్రి లక్ష్మీసమేత మాధవుడు శేషవాహనంపై విహరించారు. శనివారం రాత్రి హనుమంతవాహనంపై ఊరేగారు.

● **పెళ్లి పెద్దలుగా ఆ గ్రామాల ప్రజలు:** బ్రహ్మోత్సవాల్లో జరిగే కల్యాణ వేడుకలో రెండు గ్రామాల ప్రజలు పెళ్లి పెద్దలుగా వ్యవహరిం చడం ఇక్కడి విశిష్టత. వరుడు మాధవుడి తరపు ఎస్‌హెచ్ ఎర్రగుడి, వధువు లక్ష్మీదేవికి గోరంట్ల గ్రామ ప్రజలు పెద్దలుగా ఉంటూ పెళ్లితంతు నడిపిస్తారు. ఆదివారం రాత్రి వరుడు తరపు ఎర్రగుడి గ్రామస్థులు ముస్తాబు చేసిన ప్రభను తీసుకుని మేళతాళాల మధ్య హంద్రీనదిలో నడుచుకుంటూ గోరంట్లకు చేరుకుంటారు. ఆలయం వద్ద ప్రభను ఉంచి, వరుడిని పల్లకిలో తీసుకుని ఆచారుల ఇంటి వద్ద ఆశీనులైన వధువు లక్ష్మీ దగ్గరకు వెళతారు. అక్కడ ఇరుగ్రామాల పెద్దలు తాంబూలాలు ఇచ్చుకుంటారు. అనంతరం స్వామి అమ్మవార్లను పల్లకిలో ఆలయంలో కల్యాణకట్ట చేర్చుతారు. ఈ తతంగం పూర్తయ్యే సరికి అర్ధరాత్రి దాటుతుంది. ఆపై పురోహితుల వేదమంత్రాలు పఠిస్తూ బ్రహ్మముహూర్తంలో లక్ష్మీమాధవులకు కల్యాణం జరుగుతుంది. అనంతరం నిర్వహించే గరుడవాహన సేవలో గోరంట్ల, ఎర్రగుడి గ్రామాల ప్రజలు పాల్గొంటారు. గరుడ సేవలో ముందువైపున ఉన్న ఎర్రగుడి ప్రజలు లాగుతుండగా, గోరంట్ల ప్రజలు నిలువరించే ప్రయత్నం ఆద్యంతం వినోదంగా సాగుతుంది.

పది పరీక్షలకు వేళాయే..

- రేపటి నుంచి ప్రారంభం
- హాజరు కానున్న 1,202 మంది విద్యార్థులు



కోడుమూరులోని జీవీఆర్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల

కోడుమూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు పరీక్షల నిర్వహణకు వేళైయింది. ఈ నెల 17 నుంచి 31 వరకు పదో తర గతి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల్లో మండలంలోని మొత్తం 1,202 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేశారు. కోడుమూరు మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి చదువుతున్న బాలురు 559 మంది అలాగే 445 మంది బాలి కలు, పరీక్షలకు అలాగే వివిధ ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న మరో 198 మంది విద్యార్థులు పది పరీక్షల్లో పాల్గొననున్నారు. కోడుమూరు బాలికల జడ్పీ పాఠశాలలో 206 మంది, కోడుమూరు బాలుర పాఠశాల నుంచి 144 మంది విద్యార్థులు, ఏపీ మోడల్ స్కూల్ నుంచి 91 మంది, వర్కూరు కేజీబీవీ 40 మంది, గోరంట్ల గురుకుల పాఠశాల నుంచి 79 మంది, గోరంట్ల పాఠశాల నుంచి 68 మంది కల్లపరి నుంచి 16 మంది, లద్దగిరి నుంచి 119 మంది, పులకుర్తి నుంచి 54 మంది, ప్యాలకుర్తి నుంచి 79, అమడగుంట్ల నుంచి 76 మంది, కోడుమూరు ఉర్దూ పాఠశాల నుంచి 6మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులకు మంచినీరు, వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచనున్నారు. పరీక్ష కేంద్రం ఆవరణంలో 144 సెక్షన్ అమలు ఉంటుంది.

ఆరు కేంద్రాల్లో పది పరీక్షలు: కోడుమూరు మండలంలో ఆరు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. కోడుమూరు బాలిక జడ్పీ ఉన్నత పాఠశాల 2 కేంద్రాలు, కోడుమూరు బాలుర జడ్పీ ఉన్నత పాఠశాలలో ఒక కేంద్రం, కోడుమూరు ఏపీ మోడల్, గోరంట్ల, లద్దగిరి ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారి పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలంటే భయాన్ని విద్యార్థులు వీడాలని, ఎలాంటి టెన్షన్ లేకుండా పరీక్షలు ప్రశాంతంగా రాయాలని కోడుమూరు ఎంఈవో తైమూన్‌బాషా పిలుపునిచ్చారు.

రైతు సేవా కేంద్రం తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఏవో

కోడుమూరు రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాలకుర్తిలో శనివారం రైతు సేవా కేంద్రాన్ని వ్యవసాయాధికారి రవిప్రకాష్ తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రైతులకు గుర్తింపు కార్డు ఇవ్వాలని ఆదేశించారు. రైతులు తప్పనిసరిగా గుర్తింపు కార్డు తీసుకోవాలని సూచించారు. అలాగే స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా సిబ్బందితో కలిసి పరిస రాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్కే సిబ్బంది హనీఫ్, బాషా, రఫీ పాల్గొన్నారు.

ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలు

ఓర్వకల్లు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో అధికార పార్టీలో ఇరువర్గాల మధ్య ఘర్షణ శనివారం చోటు చేసు కుంది. వివరాలిలా ఉన్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్ విషయంలో ఇరు కుటుం బాలకు మనస్పర్థలు ఏర్పడ్డాయి. కురువ పెద్ద గిడ్డయ్య, బోయ ఎర్రమల, ఇరు కుటుంబాలు ఒకే పార్టీకి చెందిన వారు. కురువ పెద్ద గిడ్డయ్య గ్రామంలో సీసీ రోడ్లు రూ.10 లక్షలతో నిర్మించేందుకు అధికారులు అను మతి ఇవ్వగా, ఆ కాలనీలో మార్కింగ్ వేస్తుండగా.. బోయ ఎర్రమల కుమారుడు మహేష్, కుమార్తె విజయలక్ష్మి మాటామాటా పెరిగి కురువ పెద్ద గిడ్డయ్య తలపై మహేష్ కట్టెతో కొట్టడంతో తలకు గాయాల య్యాయి. విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలా నికి వెళ్లి విచారణ చేపట్టారు. గాయాలైన కురువ పెద్ద గిడ్డయ్యను హుటాహుటిన కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మొండి బకాయిలపై ఉక్కుపాదం

కర్నూలు న్యూసిటీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థకు దీర్ఘకాలికంగా పన్నులు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బకాయిదారులపై కఠినంగా వ్యవహరించాలని కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన టెలికాన్ఫరెన్సు ద్వారా ఆర్ఓలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ప్రత్యేక అధికారులు, ఏఈలు, అడ్మిన్, ఏమినిటీస్ కార్యదర్శులతో పన్ను వసూళ్లపై సమీక్షించారు. ముందుగా నగర పాలక కార్యాలయంలోని పన్ను వసూళ్ల కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి పన్ను చెల్లింపునకు ఎటువంటి గడువు, రాయితీ లేదన్నారు. ఇప్పటికే బకాయిలు చెల్లించని దుకాణాలను సీజ్ చేశామని, అలాగే 62 తాగునీటి కొళాయి కనెక్షన్లు కట్ చేశామని అన్నారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు ఆర్ఓ జునైద్ ఉన్నారు.

చర్యలు తీసుకోండి

కర్నూలు అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన మాజీ అధికారులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లాకు వచ్చిన రోడ్లు, భవనాల శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్య క్షుడు రాగిరి చంద్రప్ప, భీమ్ ఆర్మీరాష్ట్ర కన్వీనర్ ఎస్.విజయభాస్కర్, అంబేడ్కర్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ రాఘవేంద్రలు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా వర్సిటీలో ఉన్నత పదవుల్లో ఉండి ఫర్నిచర్ బిల్లుల మాయం, కీలక ఫైళ్ల దొంగతనం లాంటి అంశాలపై ఇప్పటికే సీఐడీ కేసులు ఉన్నప్పటికీ గత ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు.

వాల్మీకి విగ్రహం ఆవిష్కరణ

కల్లూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం వామసముద్రంలో ఏపీ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ డి.రామాంజనేయులు ఆధ్వర్యంలో శనివారం వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కుబేరస్వామి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేతం కృష్ణుడు, వాల్మీకి సేవాసంస్థ అధ్యక్షుడు కొల్లాయి పెద్దయ్య, విష్ణు, శేఖర్, గోకారి, రంగడు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి: ఎంపీడీవో


మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

ఓర్వకల్లు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం ఓర్వకల్లులోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీపీ తిప్పన్న, అధ్యక్షత వహించారు. గత సమావేశంలో చర్చించిన అంశాలు, వాటి పురోగతిపై సమావేశంలో సభ్యులకు వివరించారు. గుట్టపాడు సర్పంచ్ నర్ల మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉన్నాయని, గ్రామాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా అందించాలని, తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చొరవ చూపాలన్నారు. ఏఈ సునీల్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా అందిస్తున్నామని, అయితే.. కొన్ని గ్రామాల్లో లైన్‌మెన్లు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. మీదివేముల ఎంపీటీసీ పద్మనాభరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్నారని అయితే.. రైతులకు ఉపయోగపడే పనులు చేపడితే బాగుంటుందన్నారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పలు సమస్యలను సభాదృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయనీ, ఎక్కువ సంఖ్యలో ఉపాధి పనులకు కూలీలు వచ్చే విదంగా ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలన్నారు. ఎంపీపీ తిప్పన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్వే డిప్యూటీ తహసీల్దార్ షర్మిళా రెడ్డి, ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు, ఏఈలు రామయ్య, శ్రీనివాసులు, నరేంద్రనాథ్ రెడ్డి, ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు, ఎంపీటీసీలు సరోజమ్మ, పుల్లయ్య, సోమశేఖర్ రెడ్డి, పద్మనాభ రెడ్డి, నాగ శిరీష, ప్రవీణ్ కుమార్ రెడ్డి, సర్పంచులు మోహన్ రెడ్డి, అయ్యస్వామి, రామచంద్రుడు, పుష్పమ్మ, శ్రీరెడ్డి రజితమ్మ, శకుంతలమ్మ, పెద్ద కాశీం పాల్గొన్నారు.

కర్నూలు జీజీహెచ్‌లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర


వైద్యులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్


ఓర్వకల్లులో..


బి.తాండ్రపాడులో చెత్తను తొలగిస్తున్న సర్పంచు ఆకెపోగు జయన్న

కర్నూలు హాస్పిటల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆసుపత్రిలో ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహం ఎదుట డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కె.సీతారామయ్య ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి హానీ కలుగుతుందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరిం టెండెంట్ డి.శ్రీరాములు, ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ రామశివ నాయక్, అడ్మినిస్ట్రేటర్ సింధూ సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డా.శివబాల, న్యూడయోగ్నస్టిక్ బ్లాక్ ఇన్‌చార్జి డా.సునీల్ ప్రశాంత్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్‌పీ సావిత్రీబాయి పాల్గొన్నారు.

● **జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో:** జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం డీఎంహెచ్‌వో పి.శాంతికళ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛత దివస్ కార్యక్రమంలో భాగంగా కార్యాలయ పరిసరాలను సిబ్బంది శుభ్రం చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్లు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛత దివస్ కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం డీఎంహెచ్‌వో ప్రతిజ్ఞ చేయించారు. పరిపాలన అధికారి కారుమంచి అరుణ, ఎస్‌వో హేమసుందరం, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ ఎపీడమోలజిస్టు వేణుగోపాల్, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి పాల్గొన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత: మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కర్నూలు స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ ప్రకాష్, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డి.శ్రీరాములు అన్నారు. స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌లో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం కింద మొక్కలు నాటారు. కార్యక్రమంలో క్యాన్సర్ హాస్పిటల్ సివిల్ సర్జన్ ఆర్ఎంవో డా.బి.హేమనళిని, వైద్యులు పాల్గొన్నారు.

కర్నూలు రూరల్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని టీడీపీ నాయకుడు కోడుమూరు నియోజకవర్గ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆకెపోగు జయన్న అన్నారు. కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామంలో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు శనివారం గ్రామంలో స్వచ్ఛా ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి సర్పంచు ఆకెపోగు జయన్న హాజరై సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామంలోని పలు కాలనీల్లో పిచ్చిమొక్కలను, రోడ్లపై చెత్తచెదారం తొలగించారు. పంచాయతీ కార్యదర్శి గోపాల్ పాల్గొన్నారు.

కల్లూరు: ప్లాస్టిక్ రహిత స్వచ్ఛ దివస్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన అవసరమని ఎంపీడీఓ అన్నారు. శనివారం ఉలిందకొండ గ్రామంలో సర్పంచు ఎం.సుంకులమ్మ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఈవీ రమణ, రంగస్వామిరెడ్డి, శ్రీకాంత్, షేక్షావలి, సీవీ రమణ, ఆశోక్, ఎంపీటీసీలు ఆల చంద్రకళ, అనురాధా, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కర్నూలు క్రైం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని సర్కిల్ పోలీస్ స్టేషన్‌లలో స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని జిల్లా పోలీసు అధికా రులు, సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్ స్టేషన్లలోనూ, ఆవరణలోని పరిసరాలను పరిశుభ్రం చేశారు. పిచ్చి మొక్కలను తొలగించారు.

కోడుమూరు: కోడుమూరు ఎల్లెల్సీ సబ్ డివిజన్ ఆవరణలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇరిగేషన్‌శాఖ ఈఈ పాండురంగయ్య శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సకాలం సాగునీరు అందించి రైతుల పంటలను కాపాడాల్సిన బాధ్యత నీటిపారుదలశాఖ అధికారులపై ఉందని అన్నారు. ఎల్లెల్సీ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భం గా రిటైర్డ్ వర్క్ఇన్‌స్పెక్టర్ రామేశ్వర్‌రెడ్డి, ఆంజనేయులు లస్కర్లు కలిసి ఈఈను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో డీఈ సుబ్బారాయుడు, ఎల్లెల్సీ, జీడీపీ జేఈలు మోహన్‌రావు, దుర్గాభవాని, లక్ష్మన్న, లక్ష్మీనారాయణరెడ్డి, సూర్యప్రకాష్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మాదన్న పాల్గొన్నారు.

ఓర్వకల్లు: స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా పనిచేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలం లోని ఓర్వకల్లు, కాల్వ, హుశేనాపురం, సోమయాజులపల్లె, కొమరోలు, నన్నూరు, పూడిచెర్ల, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, లొద్దిపల్లె, ఎన్.కొంత లపాడు తదితర గ్రామాల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనులు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం అధికారులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు గోవిందరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, తిరుపాలు, పుల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గూడూరు: స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని మండల టీడీపీ అధ్య క్షుడు సురేష్ అన్నారు. శనివారం గూడూరు మండలం పెంచికల పాడు గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివనాగప్రసాద్, ఎంపీటీసీ మద్దిలేటి, అధికా రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి


కాన్షీరామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పట్నం రాజేశ్వరి

కర్నూలు అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల ఆశాజ్యోతి కాన్షీరామ్ అని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల ఐక్య వేదిక వ్యవస్థాపకురాలు పట్నం రాజేశ్వరి అన్నారు. శనివారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షురాలు నందివిజయలక్ష్మి ఆధ్వర్యంలో కాన్షీరామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

పదిలో మంచి ఫలితాలు సాధించాలి

గూడూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు బాగా చదివి మంచి ఫలితాలు సాధించాలని కౌన్సిలర్ రత్నమ్మ, కోఆప్షన్ సభ్యుడు రామాంజనేయులు అన్నారు. శనివారం గూడూరు జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో పది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్‌ను పంపిణీ చేశారు. హెచ్ఎం సురేష్ బాబు, పరుశు రాముడు, కర్ణ, బాబు, క్రిష్ణ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం

సి.బెళగల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలకల్లు చెన్న సోమేశ్వర జాతరను పురస్కరించుకుని నిర్వహించిన బండలాగుడు పోటీల విజేతకు ఆలయ కమిటీ పెద్దలు బహుమతులను అందజేశారు. అలాగే గిరక బండి పోటీలు, పాలబండ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు ఎల్లెల్సీ మాజీ చైర్మన్ చిన్న కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

సి.బెళగల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని ఏపీవో రామన్న సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఉపాధి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఈసీ రంగస్వామి పాల్గొన్నారు.

కేఫా ప్రార్థనా మందిరం ప్రారంభం

కర్నూలు న్యూసిటీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): జోహరాపురంలో నూతనంగా నిర్మించిన కేఫా ప్రార్థనా మందిరాన్ని విశాఖ పట్టణానికి చెందిన ముఖ్య ప్రసంగీకులు పాస్టర్ టి.జెపన్యా శాస్త్రి శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జోహరాపురంలో నివాసిస్తున్న ప్రజల క్షేమం కోసమే ఈ మందిరం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పాస్టర్ రవికుమార్, సద్గుణ రాజు, భాస్కర్, జాన్, తిరుపాల్, లాజర్ పాల్గొన్నారు

ఉపయోగమెప్పుడు?



మండల కేంద్రంలోని వార్డు సచివాలయం -2 భవనం నిర్మించిన అధికారులు ప్రారంభించడం మరిచారు. ప్రభుత్వ పథకాలు, ధ్రువీకరణ పత్రాల కోసం రెండు కి.మీ.ల దూరంలోని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌ను వివరణ కోరగా ఎంపీడీవోతో మాట్లాడి అక్కడే ఏర్పాటు చేస్తామన్నారు. - హొళగుంద

తొలగించేదెప్పుడు?



ఆలూరులో చెత్త తొలగించకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కోయ నగర్ ఎస్సీ బాలికల హాస్టల్ వెనుక చెత్త కుప్పలు నిండిపోయాయి. పక్కనే ప్రభుత్వ పాఠశాల కూడా ఉండటంతో అక్కడ దుర్వాసన రావడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని కోరుతున్నారు. - ఆలూరు

స్వచ్ఛ బస్టాండుగా తీర్చిదిద్దుదాం

ఆదోని అగ్రికల్చర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్, డిపోను స్వచ్ఛంగా తీర్చిదిద్దుతామని డిపో మేనేజర్ మహమ్మద్ రఫి అన్నారు. శనివారం బస్టాండు ఆవరణలో చెత్తను తొలగించారు. ప్రయాణికులు ఎక్కడబడితే అక్కడ చెత్తను వేయొద్దని, చెత్త కుండీలోనే వేయాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దామని సూచించారు.

ప్లాస్టిక్‌ను ఉపయోగించవద్దు



మద్దికెరలో ర్యాలీ నిర్వహిస్తున్న డీఎల్‌పీవో వీరభద్రప్ప

మద్దికెర, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్లాస్టిక్‌ను ఉపయోగించవద్దని డీఎల్‌పీవో వీరభద్రప్ప సూచించారు. శనివారం గ్రామంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్‌తో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి, సర్పంచ్ బండారు సుహాసిని, ప్రధానోపాధ్యాయులు దేవేంద్రప్ప, కార్యదర్శి శివకుమార్, రేణుక, సభ్యులు ఎన్.లక్ష్మీనారాయణ, కవిరెడ్డి కృష్ణ, రామాంజులు, కృష్ణ ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆదోని, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కౌతాళం మండలం కుప్పగల్లు రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం.2 ట్రాక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నారు. స్థానికుల సమాచారం మేరకు ఆదోని రైల్వే స్టేషన్ ఎస్సై గోపాల్ మృతదేహాన్ని పరిశీలించగా ఆధారాలు లభ్యం కాలేదు. వయస్సు సుమారు 45 పైబడి ఉంటుందని, మృతుడు కాషాయ రంగు దుస్తులు ధరించి ఉన్నాడన్నారు.

టూటౌన్ సీఐగా రాజశేఖర్ రెడ్డి



ఆదోని, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ టూటౌన్ సీఐగా రాజశేఖర్ రెడ్డి శనివారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సూర్య మోహన్‌రావు కర్నూలులో రిపోర్టు చేసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలతో వెళ్లడంతో ఆ స్థానంలో అనంతపురం వీఆర్‌లో ఉన్న ఎన్.రాజశేఖర్ రెడ్డిని నియమించారు. సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతలును పరిరక్షిస్తానని, మట్కా, గుట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణా విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు.

సీసీ రోడ్డు డ్రైనేజీ ఏర్పాటుపై హర్షం



సీసీ రోడ్డు నిర్మాణ పనుల వద్ద టీడీపీ నాయకులు

హొళగుంద, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు, డ్రైనేజీ ఏర్పాటు చేయడం పట్ల టీడీపీ నాయకుడు బుడగ జంగాల రామాంజిని హర్షం వ్యక్తం చేశారు. శనివారం బుడగజంగాల కాలనీలో పల్లె పండుగలో భాగంగా రూ.10 లక్షలతో 160 మీటర్ల సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను ప్రారంభించారు. పీఆర్‌జేఈ యమునప్ప, టీడీపీ నాయకులు డొక్కా రామయ్య, గోవిందు, మల్లేష్, ఎల్లప్ప పాల్గొన్నారు.

లభించని యువకుడి ఆచూకీ

ఆదోని రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసాపురం ఎల్లెల్సీలో శుక్రవారం గల్లంతైన బోయగేరికి చెందిన హరికృష్ణ ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. స్నేహితులతో కలిసి హోలీలో పాల్గొన్న హరికృష్ణ ఈత కొట్టడానికెళ్లి ఎల్లెల్సీలో గల్లంలయ్యాడు. శనివారం అగ్నిమాపక అధికారులు, ఇస్వీ పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో రాత్రి వరకు గాలించారు.

పట్టాలు మంజూరు చేయాలి



సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షేర్ ఖాన్ కొట్టాల వాసులకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం కార్యదర్శి లక్ష్మన్న, కార్యవర్గ సభ్యుడు తిప్పన్న డిమాండ్ చేశారు. శనివారం అంబేడ్కర్ నగర్, కౌడల్‌పేట, షేర్ఖాన్ కొట్టాలలో ప్రజా చైతన్యయాత్ర నిర్వహించారు. వీరేష్, శివ, ఈరన్న, ఈరప్ప పాల్గొన్నారు.

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం



ప్రతిజ్ఞ చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి

వెల్దుర్తి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుదామని పంచాయతీ సెక్రటరీ లక్ష్మీనాథ్ పిలుపునిచ్చారు. శనివారం పాతబస్టాండ్ కూడలిలో స్వచ్ఛ భారత్- స్వచ్ఛ సేవాలో నిర్వహించారు. సర్పంచ్ శైలజ, ఉపసర్పంచ్ నాయకంటి శ్వేతతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో చెత్తాచెదారాన్ని తొలగించారు.

మున్సిపాలిటీలకు స్వేచ్ఛ

- నిధులు నేరుగా ఖర్చు పెట్టుకునేందుకు అవకాశం
- హర్షం వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టర్లు, అధికారులు



ఆదోని పురపాలక కార్యాలయం

ఆదోని టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఒక పనులు చేపించేందుకు అధికారులు, కాంట్రాక్టర్లు ఇక భయపడాల్సిన పనిలేదు. మునిసిపాలిటీల్లో కాంట్రాక్టు పనులు చేసి, బిల్లుల కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేకుండా పనులు చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ఆర్థిక శాఖ అనుమతితో పనిలేకుండా నిధులు వినియోగంపై మున్సిపాలిటీలకు ఆర్థిక స్వేచ్ఛను కల్పించనుంది.

వైసీపీ హయాంలో సీఎఫ్‌ఎంఎస్

2018 వరకు మునిసిపాలిటీ నుంచే నేరుగా బిల్లుల చెల్లింపు జరిగేది. పనులను చేయడానికి కాంట్రాక్టర్లు పోటీ పడేవారు. అయితే 2019 చివర్లో వైసీపీ అధికారంలోకి రావడంతో సీఎఫ్‌ఎంఎస్ విధానాన్ని ప్రవేశపెట్టింది. దీంతో మున్సిపాలిటీల నిధులు ప్రభుత్వ ఆదీనంలోకి వెళ్లాయి. ఫలితంగా తాము పనులకు బిల్లులు సకాలంలో అందక కాంట్రాకర్లు, సమాధానం చెప్పలేక అధికారులు విసిగిపోయారు.

మున్సిపాలిటీలకు ఆర్థిక స్వేచ్ఛ

వైసీపీ ప్రవేశ పెట్టిన సీఎఫ్‌ఎంఎస్ విధానానికి కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. మునిసిపాలిటీలే నేరుగా నిధులను ఖర్చు పెట్టుకొనే విధానాన్ని ప్రవేశపెట్టనుంది. ఏప్రిల్ నుంచే ఈ విధానం మలులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ విధానంపై నెలాఖరులోగా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందుతాయని అధికారులు భావిస్తున్నారు. ఇంతకాలం పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పట్టణాభివృద్ధి పడకేసింది. ఇక నుంచి పట్టణం అభివృద్ధి బాట పడుతుందని అధికారులు, కాంట్రాక్టర్లు, ప్రజలు భావిస్తున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ బాధితులకు వరం



ఆదోనిలో చెక్కులు పంపిణీ చేస్తున్న మీనాక్షినాయుడు



పత్తికొండలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఆదోని, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు వరమని నియోజక టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు అన్నారు. శనివారం స్వగృహంలో 25 మందికి రూ.17.67 లక్షలు చెక్కులను పంపిణీ చేశారు. ప్రజారోగ్య పరిరక్షణే కూటమి తొలి ప్రాధాన్యమని అనారోగ్యంతో ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు అండనిస్తుందన్నారు.

పత్తికొండ: నియోజకవర్గంలోని 20 మంది బాధితులకు ఎమ్మెల్యే శ్యాంబాబు రూ. 29,44,649ల చెక్కులను పంపిణీ చేశారు. చికిత్సలు చేయించుకునే పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరమన్నారు. సాంబశివారెడ్డి, తుగ్గలి నాగేంద్ర, పురుషోత్తం చౌదరి, రామానాయుడు, బత్తిన లోక్‌నాథ్, సుధాకర్, గోవిందు తదితరులు ఉన్నారు.

ముగిసిన హోలీ సంబరాలు



మహిళల వేషధారణలో పురుషులు

ఆదోని రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతేకుడ్లూరు గ్రామంలో హోలీ సంబరాలు శనివారం ముగిశాయి. ఉదయం అగ్నిగుండం వద్ద రాజకీయ నాయకులు, గ్రామ పెద్దలు తమ తప్పులను ఒప్పుకుని శవయాత్ర చేశారు. పురుషుల స్త్రీల వేషధారణలో చీర కట్టుకొనిరతీమన్మథులకు నైవేద్యం సమర్పించారు. రాత్రి రథోత్సవం నిర్వహించారు. తాలుకా సీఐ ఎల్లప్ప, ఎస్సైలు నాగేంద్ర, రామాంజనేయులు, మహేష్ కుమార్ బందోబస్తు నిర్వహించారు.

వైభవంగా వసంతోత్సవం



పెద్దహోతూరులో రంగులు చల్లుకుంటున్న గ్రామస్థులు

ఆలూరు రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దహోతూరు గ్రామం ఉచ్చవీరప్ప తాత, చలువప్ప తాత రథోత్సవ ఉత్సవాల్లో భాగంగా శనివారం వసంతోత్సవం నిర్వహించారు. గ్రామస్థులు రంగులు చల్లుకున్నారు. సర్పంచులు జొరహాపురం వీరేశ్, బురిజింటి ఎల్లప్ప, ఎంపీటీసీలు చిన్న యాదవ్, దేవరాజు, జానకమ్మ, కురవ లక్ష్మన్న, కెకెడీ పాల్గొన్నారు.

పత్తికొండను ఆదర్శంగా తీర్చి దిద్దుతున్నాం

పత్తికొండ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దుతున్నామని ఎమ్మెల్యే శ్యాంబాబు అన్నారు. శనివారం పత్తికొండ సర్పంచ్ కొమ్ము దీపిక తో కలిసి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు స్వచ్ఛ భారత్ - స్వచ్ఛ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు

సర్వే నెం.352, 444లలో రిజిస్ట్రేషన్ చేయొద్దు

- సబ్ రిజిస్ట్రార్‌ను ఆదేశించిన సబ్ కలెక్టర్ మౌర్య భరద్యాజ్

ఆదోని, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండగిరి సాధాపురం రెవెన్యూ సర్వే నెంబర్ 352,444లలో రిజిస్ట్రేషన్లను చేయవద్దని సబ్ కలెక్టర్ మౌర్య భరద్యాజ్ సబ్ రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. ఈ భూముల్లో డబుల్ రిజిస్ట్రేషన్లు చేసినట్లు ప్రజల నుంచి భారీగా ఫిర్యాదులు అందాయన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లారని, రెవెన్యూ అధికారులు చర్యలు ప్రారంభించారని అన్నారు.

అసెంబ్లీలో ప్రస్తావించడం అభినందనీయం

ఆదోని టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : అసెబ్లీలో ఆదోనిని అత్యంత వెనకబడిన ప్రాంతంగా గుర్తించాలని ఎమ్మెల్యే పార్థసారథి ప్రస్తావించడం అభినందనీయమని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నాగరాజ్ గౌడ్ అన్నారు. శనివారం మాట్లాడుతూ పారిశ్రామికంగా ఆదోని రెండో ముంబాయిగా ఉన్నా, ప్రస్తుతం భారీ పరిశ్రమలు మూతబడ్డాయన్నారు. డిప్యూటీ స్పీకర్ తోసిపుచ్చకుండా పరిగణనలోకి తీసుకొని అభివృద్ధికి సహకరించాలని కోరారు.

తలారి మృతి

ఆదోని రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నహరివాణం గ్రామ తలారి మూకప్ప శనివారం మృతి చెందాడు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడున్నాడు. తహసీల్దార్ శివరాముడు మృతుడి కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.25వేల ఆర్థిక సాయం అందించినట్లు వీఆఏల సంఘం డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు.

హమ్మయ్య.. పరీక్షలు ముగిశాయి

- వీడ్కోలు చెప్పుకున్న విద్యార్థులు



ఆదోనిలో స్నేహితులతో మాట్లాడుతున్న విద్యార్థినులు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) పరీక్షలు ముగియడంతో ఇంటర్మీడియట్ విద్యార్థులు శనివారం ఉత్సాహంగా కనిపించారు. మార్చి 1న పరీక్షలు ప్రారంభం కాగా, పట్టణంలో 7 పరీక్ష కేంద్రాల్లో 3150 మంది ద్వితీయ సంవత్సర పరీక్షలకు హాజరయ్యారు. కొందరు విద్యార్థులు ఫలితాలపై ధీమా వ్యక్తం చేశారు. మరికొందరు విద్యార్థులు బేకరీలు, హోటళ్లలో పార్టీలు చేసుకుని, స్నేహితులకు వీడ్కోలు పలికారు.

డాక్టర్ కావడమే లక్ష్యం



ఇంటర్ ఫస్టియర్ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాను. రెండో ఏడాదిలోనూ మంచి మార్కులు వస్తాయని ఆశిస్తున్నాను. నీట్, కోచింగ్‌కి హైదరాబాద్ లేదా విజయవాడ వెళ్లాలని ప్రణాళిక వేసుకున్నాను. **- రోహిణి, బైపీసీ, అక్షర శ్రీ కళాశాల**

ముగిసిన ఇంటర్ పరీక్షలు

మద్దికెర: ఇంటర్ పరీక్షలు ముగిశాయి. స్థానిక ఆదర్శ పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో విద్యార్థులు పరీక్షలు రాశారు. విద్యార్థులు ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు.

ఆలూరు అభివృద్ధి కోసం పని చేస్తా

- టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్



మాట్లాడుతున్న వీరభద్ర గౌడ్

ఆలూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తాను ఓడిపోయినా అభివృద్ధి కోసం పని చేస్తానని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్టీలో విభేదాలు సృష్టించే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆలూరు సమస్యలను ఇతర జిల్లాల ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రస్తావిస్తుంటే స్థానిక ఎమ్మెల్యే విరుపాక్షి ఒక్కసారైనా అసెంబ్లీలో ప్రస్తావించారా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ కుట్టు శిక్షణ ఇచ్చి ఉచితంగా మిషన్లు పంపిణీ చేస్తుందన్నారు. ఇక నుంచి ప్రతి బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉంటుందన్నారు. ఈనెల 29న టీడీపీ ఆవిర్భావ దినోత్సవం గ్రామాల్లో నిర్వహించాలన్నారు. త్వరలో ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామనాయుడు, జిల్లా మంత్రి టీజీ భరత్‌ను ఆహ్వానించి. అభివృద్ధి కార్యక్రమాలు చేపడతా మన్నారు. ఏబీసీ కెనాల్ డీసీ అధ్యక్షుడు నగర డోణ కిష్టప్ప, రఘుప్రసాద్ రెడ్డి, అట్టికల్ బాబు, హరి, అంపయ్య, సురేంద్ర, కొమ్ము రామాంజినేయులు, రాజు, రాము యాదవ్, గుండయ్యా, రమేష్, సుబాన్, ముద్దు రంగ, గుల్యం రామాంజి, మసాలా జగన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు స్వీకరించారు.

నిధుల విడుదలపై హర్షం

ఆదోని టౌన్: టమోటా యూనిట్‌కు నిధుల విడుదలపై ఆదోని ఏరియా డెవలప్మెంట్ అసోసియేషన్ కన్వీనర్ ఆదినారాయణ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్‌ను కలిసి అభినందనలు తెలిపారు. వేదవతి ప్రాజెక్టుకు కూడా నిధులు కూడా కేటాయించాలని కోరారు.

దాహార్తి తీర్చండి



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న రాము నాయక్

తుగ్గలి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన తండాల్లో తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని టీడీపీ జిల్లా ఎస్టీ సెల్ నాయకులు రాము నాయక్ కోరారు. శనివారం ఎమ్మెల్యే శ్యాంబాబును కలిశారు. మండలంలోని బాట తండా, మీటె తండాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉందని, అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కంబగిరి, ఈశ్వరయ్య తదితరులు ఉన్నారు.

సస్పెండ్ చేయాలి

వెల్దుర్తి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని సీపీఐ కార్యదర్శి కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. పాఠశాలలో అవినీతిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి సుధీర్ నాయుడు, సీపీఐ నాయకులు చిన్నమాదులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు బాలు, శేషు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోండి

ఆలూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పాలీసెట్-2025కు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ సీ చిపప్ప రెడ్డి శనివారం తెలిపారు. ఏప్రిల్ 15వ తేదీలోగా దరఖాస్తులు అందించాలని మార్చి 12 నుంచి ప్రక్రియ ప్రారంభమైం దన్నారు, ఎస్సీ, ఎస్టీలు రూ.100, బీసీ, ఓసీలు రూ.400 చెల్లించాలన్నారు.

టమోటా యూనిట్లను విస్తరింపజేయాలి



మాట్లాడుతున్న రామచంద్రయ్య

- రైతు సంఘం గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య

పత్తికొండ టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పత్తికొండలో ఏర్పాటు చేయబోయే టమోటా ప్రాసెసింగ్ యూని ట్లను మరింత విస్తరింపజేయాలని రైతు సంఘం గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సీఆర్ భవన్‌లో మాట్లాడారు. ఈ ప్రాంతంలో ఏళ్లుగా టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని తాము పోరాడామన్నారు. చివరకు శుక్రవారం భూమి పూజ చేయడం శుభ పరిణామమన్నారు. ప్రాసెసింగ్ యూనిట్లలో సహకార సంఘాల రైతులను భాగస్వామ్యులను చేసి, మినీ పరిశ్రమను ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతానికి మేలు చేకూరుతుందన్నారు. పత్తికొండ ప్రాంతంలో వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటుకు మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే శ్యాంబాబు చొరవ చూపాలని కోరారు. సీఎం చంద్రబాబు పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వడం హర్షించదగ్గ విషయన్నారు. సీపీఐ కార్యదర్శి రాజాసాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు ఉమాపతి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

అస్పరి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మస్తాన్ వలి శనివారం తెలిపారు. వివరాల మేరకు.. హాలహర్వి మండలం బిలేహాళ్ గ్రామానికి చెందిన గొల్ల మహేంద్ర బైక్‌పై కర్ణాటక మద్యాన్ని పత్తికొండ తాలూకా నల్లగొండ్ల గ్రామానికి తరలిస్తుండగా ఆస్పరిలో అదుపులోకి తీసుకున్నారు.

పెట్రోల్ బంకులో విజిలెన్స్ తనిఖీలు

ఆలూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బళ్ళారి రోడ్డులో ఉన్న హిందూస్తాన్ ఫిల్లింగ్ స్టేషన్‌లో శనివారం విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్, శ్రీనివాసులు సర్వీస్ ఇంజనీర్ ఇంతియాజ్‌లు తనిఖీ చేశారు. పెట్రోల్ కల్తీపై ఫిర్యాదులు వచ్చాయని, అయితే తనిఖీలో కల్తీ లేదని నిర్ధారించాయన్నారు. తహసీల్దార్ గోవింద్ సింగ్, సీఎస్‌డీటీ దీప, ఆర్ఐ బసవన్న గౌడ్ పాల్గొన్నారు.

రమణీయం.. ప్రహ్లాదరాయల వెండి రథోత్సవం



వెండి రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శనివారం పాల్గుణ మాస పాడ్యమి శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.బృందావనాన్ని బంగారు, వెండి, పట్టువస్త్రాలు,ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. పూర్ణబోధపూజ మందిరంలో ఉత్సవమూర్తికి పాదపూజ చేసి పల్లకిలో ఊరేగించారు. పీఠాధిపతి స్వహస్తాలచే మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు.

ప్రజా సమస్యలు తీర్చేందుకు కృషి

మంత్రాలయం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తీర్చేందుకు నిరంతరం కృషి చేస్తానని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. శనివారం మాధవరం తన నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోనే చాలా మంది అర్జీలు ఇచ్చేందుకు క్యూ కట్టారు. అర్జీలను తీసుకుంటూ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏ కష్టం, సమస్యలు వచ్చినా వెంటనే పరిష్కరించి న్యాయం చేస్తామన్నారు. ప్రజలకు ప్రతీరోజు అందుబాటులో మా సోదరులు రఘునాథరెడ్డి, రామకృష్ణరెడ్డి, నా తనయుడు రాకేష్‌రెడ్డి అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సమస్యల పరిష్కారంపై ఎప్పటికప్పుడు అధికారులతో సంప్రదించి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్, ఇతర మంత్రుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేటట్లు కృషి చేస్తానన్నారు. కార్యకర్తలు అధైర్యపడొద్దు టీడీపీ పార్టీతో పాటు రామిరెడ్డి కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయ కులు నగేష్‌నాయుడు, వెంకటరాముడు, శివ, లక్ష్మన్న, రామయ్య, పోలి వీరేష్ పాల్గొన్నారు.

విలేకర్లకు అండగా ఉంటాం

మంత్రాలయం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో పనిచేస్తున్న విలేకర్లకు అండగా ఉంటామని మంచాల సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్‌రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి , ఏపీయుడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షులు వగరూరు జయరాజు, ప్రధాన కార్యదర్శి హుస్సేని ఆధ్వర్యంలో 2025 డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణరెడ్డి, కాంత్‌రెడ్డి, కోశాధికారి సాబువలి, సూర్యనారాయణ ఆచార్, మండల గౌరవ అధ్యక్షుడు రాజోజీరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు భీమరాయ, వెంకట్, సాగర్, నాగరాజు, శివరామ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో సెంట్రింగ్ కార్మికుడికి గాయాలు

కోసిగి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో సెంట్రింగ్ కార్మికుడికి గాయాలయ్యాయి. కోసిగిలోని 9వ వార్డు ఎన్టీఆర్ నగర్ కాలనీలో ఇళ్ల నిర్మాణం పనులు చేస్తున్న వందగల్లు గ్రామానికి చెందిన సెంట్రింగ్ గోవిందు ప్రమాదవశాత్తు ఇనుప కడ్డీలు మెయిన్ విద్యుత్ వైర్లకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో గోవిందు తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికులు హుటాహుటిని కోసిగి ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పరిశీలన



మధురైలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని మధురైలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను శనివారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి పరిశీలించారు. మదురైలో ఉన్న వీఆర్‌డీ బెస్ట్ ఫుడ్ కంపెనీని ఎమ్మెల్యే సందర్శించి అక్కడ ఏయే ఆహార పదార్థాలు తయారు చేస్తారు, ఎలా తయారు చేస్తారు, ఏ మేరకు ఉత్పత్తి చేస్తారు, ఎంత మంది సిబ్బంది ఉపాధి పొందుతున్నారు వంటి వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

వాయుపుత్రునికి ప్రత్యేక పూజలు

కౌతాళం మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ అంజనేయస్వామి దేవాలయాల్లో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలను చేపట్టారు. బుదుములదొడ్డి, ఎరిగేరి పులిగట్టు, అగసలదిన్నె అంజనేయస్వామి దేవాలయాల్లో అర్చకులు తెల్లవారుజామునే మూలవిరాట్‌కు శుద్దజలాలచే పూజించిప్రత్యేక ఫలపుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేపట్టి పూజలు చేపట్టారు. స్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. భక్తులకు దేవాలయంలో ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉపాధి వేతనాలు విడుదల చేయాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కోసిగి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న 9 వారాల ఉపాధి వేతనాలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సీపీఎం నాయకులు రాముడు, వీరేష్ డిమాండ్ చేశారు. సీపీఎం ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పెద్దభోంపల్లి గ్రామంలో ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. కూలీలకు వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొందరు పనులు వదిలి వలసబాట పడుతున్నారన్నారు. అలాగే గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొందని, వెంటనే అధికారులు తాగునీటి సమస్య పరిష్కరించి, వేతనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, చిన్నన్న పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కరువు

- ఐదేళ్లు రంగులకే పరిమితమైన వైసీపీ ప్రభుత్వం
- నివాసాల్లోకి వచ్చేందుకు ఇబ్బంది పడుతున్న లబ్ధిదారులు

ఎమ్మిగనూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణ శివారులోని శివన్న నగర్ ప్రాంతంలో నిర్మించిన టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. దీంతో లబ్ధిదారులు నివాసాలు ఉండేందుకు ముందుకు రావడం లేదు. గృహాలపై పర్యవేక్షణలేకపోవటంతో అవి అస్తవ్యస్తంగా మారాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ. కోట్లు వెచ్చించి దాదాపు మూడు వేలకు పైగా టిడ్కో గృహాలు (జీప్లస్‌త్రీ)నిర్మించారు. గృహసముదాయాల ప్రాంతంలో మౌలిక వసతులు ఏర్పాటు చేసి పంపిణీ చేసేలోపు ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో గృహాలు అలాగే ఉండిపోయాయి. అయితే అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం టిడ్కో గృహల గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో ఆ గృహాలు కాస్తా అలంకార ప్రాయంగా నిలిచిపోయాయి. అంతేగాక కరోనా సమయంలో కరోనా బారిన పడ్డవారిని గృహ సముదాయంలోని ఓ బ్లాకులో ఏర్పాట్లు చేసి కొన్ని రోజులు అక్కడ ఉంచేవారు. అటు తరువాత కూడా ఏమాత్రం గృహాల గురించి పట్టించుకున్న పాపాన లేదు. దీంతో గృహాల సముదాయంలో ముళ్ల కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. చివరికి ఎన్నికలు వచ్చే ముందు గృహాలు పంపిణీకి సిద్ధం చేసి ఇళ్లకు వైసీపీ రంగులు వేసి చేతులు దులుపుకున్నారు. ఐదేళ్ల పాలన పూర్తయిన ఇళ్లను కొందరికీ పంపిణీ చేశారే తప్ప వసతులు కల్పించిన పాపాన పోలేదు. దీంతో లబ్ధిదారులు నేటికి ఇళ్లలో నివాసం ఉండేందుకు ఆసక్తి కనబరచటంలేదు. వసతులు ఆశించిన స్థాయిలో లేనప్పటికి ఓ పది పన్నెండు కుటుంబాలు అపసోపానాలు పడుతూ జీవనం సాగిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో లబ్ధిదారుల్లో ఎక్కడలేని ఆశలు చిగురించాయి. గృహసముదాయంలో లబ్ధిదారులకు అవసరమైన తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి వసతులు ఏర్పాటు చేస్తారని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఎనిమిదినెలలు పూర్తయినా వసతుల కల్పనకు చర్యలు లేకపోవటంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కల్పించి నివాసాలు ఉండేందుకు చర్యలు తీసుకోవాలని వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. అయినప్పటికీ అధికారుల్లో చలనం లేదు.



టిడ్కో ఇళ్ల మధ్య పెరిగిన ముళ్లచెట్లు





ధ్వంసమైన కిటికి అద్దాలు, పిల్లర్లకే నిర్మాణం నిలిచిన ఓహెచ్‌ఆర్ ట్యాంకు

మౌలిక వసతులు కల్పించాలి



టిడ్కో గృహాల సముదాయంలో నివాసం ఉండేందుకు అవసరమైన తాగునీరు, కరెంటు, డ్రైనేజీలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలి. అప్పుడే లబ్ధిదారులు నివాసం ఉండేందుకు ముందుకు వస్తారు. ప్రభుత్వాలు మారుతున్నాయి కాని టిడ్కో గహాల స్థితిగతులు మాత్రం మారడం లేదు. కూటమి ప్రభుత్వమైనా వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలి.

- రాముడు, సీపీఎం, ఎమ్మిగనూరు

వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది



పట్టణ శివారు ప్రాంతంలో నిర్మించిన టిడ్కో గృహాలను సిద్ధం చేయాలని టిడ్కో సంస్థకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మౌలిక వసతుల కల్పనకు అవసరమైన సహాయసహకారాలు అందించాలని మున్సిపాలిటిని ఆదేశించింది. జూన్ నాటికి టిడ్కో గృహాలు అందుబాటులోకి వస్తాయి.

- గంగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఎమ్మిగనూరు

పది పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, బెంచీల కొరత

మోడల్ స్కూల్‌లో పనిచేయని ఆర్వో ప్లాంట్

గోనెగండ్ల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలో పదో తరగతి పరీక్షలు రాసేందుకు గాను ప్రభుత్వం మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఒక్క సెంటర్‌లో తాగునీటి సమస్య ఉంటే మరో సెంటర్‌లో విద్యార్థులు కుర్చునేందుకు బెంచీల కొరత ఉంది. దీంతో అధికారులు సమస్యను పరిష్కరించేందుకు తలపట్టుకుంటున్నారు. మండలంలో ఈ నెల 17 నుంచి 625 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. వీరి కోసం ప్రభుత్వం గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్ ను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేసింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బెంచీల కొరత తీవ్రంగా ఉంది. దీంతో అధికారులు ప్రైవేటు పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలలో ఉన్న బెంచీలను తీసుకువచ్చి జిల్లా పరిషత్ పాఠశాలలో వేసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ కేంద్రంలో 240మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 172 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు అక్కడ తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. అలాగే మోడల్ స్కూల్ లో 214 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ పాఠశాలలో గత కొంతకాలంగా తాగునీటి ఆర్వోప్లాంట్ పనిచేయడం లేదు. దీంతో పరీక్షల సమయంలో తాగునీటి సమస్య తీవ్రమవుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి బెంచీలు, తాగునీటి సమస్యను పరిష్కంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఏపీ మోడల్ స్కూల్‌లో నిరుపయోగంగా ఆర్వో ప్లాంట్

అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తాం

సోమవారం నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మండలంలో పదో తరగతి పరీక్షలకు గాను మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మూడు కేంద్రాలలో విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు గాను బెంచీలు ఏర్పాటు చేస్తున్నాం. పరీక్షలు రాసే విద్యార్థులకు తాగునీటి సమస్య రాకుండా చూస్తామని తెలిపారు.

- నీలకంఠ, ఎంఈవో- 2, గోనెగండ్ల

విద్యార్థులకు వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న పీఎస్‌యూ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్,మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని పీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పీఎస్‌యూ నాయకులు వివేక్,నవీన్,కార్తిక్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

రూ.17 లక్షలతో శాశ్వత అండర్ డ్రైనేజీ నిర్మాణం

మంత్రాలయం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రామచంద్ర నగర్ టవర్ ఏరియాలో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలు తీర్చేందుకురూ.17 లక్షలతో శాశ్వత నిర్మాణం చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వెంకటరాముడు, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య అన్నారు. శనివారం డ్రైనేజి నిర్మాణం చేపట్టే పనులకు స్థలాన్ని లైనింగ్ ఏర్పాటును పరిశీలించారు. వారు మాట్లడుతూ ఆ కాలనీలో దాదాపు 250 గృహాలు ఉన్నాయని, మురికికాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడేవారని తెలిపారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాలు మేరకుమండల ఎంపీపీ నిధులతో 500మీటర్లు పొడవుతో చాంబర్లు నిర్మాణంతో వాగులోకి కలిపే శాశ్వతపనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో శివ,నరసింహా, హనుమంతులు పాల్గొన్నారు.

చెన్నై నుంచి మంత్రాలయానికి పాదయాత్ర



మంత్రాలయానికి చేరుకున్న భక్తులు

మంత్రాలయం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం చెన్నైకు చెందిన అమన్ సత్యనాథన్‌తో పాటు 30 మంది భక్తులు పాదయాత్రతో శనివారం ఉదయం మంత్రాలయానికి చేరుకున్నారు. ఈనెల 1వ తేదీన శనివారం చెన్నై నుంచి పాదయాత్ర ప్రారంభించారు. వృద్ధులు, మహిళలు, పురుషులు, చిన్న పిల్లలతో సహా 630 కి.మీ పాదయాత్రతో మంత్రాలయంకు వచ్చారు. మొదటిసారి భక్తి పారవశ్యంతో మొక్కుబడిగా పాదయాత్రతో వచ్చి రాఘవేంద్రస్వామిని దర్శించుకుంటామని పాదయాత్ర మండలి సభ్యులు తెలిపారు. మంత్రాలయంలో రాఘవేంద్ర సర్కిల్ నుంచిశ్రీమఠం మహా ముఖద్వారం వరకు ఊరేగింపు నిర్వహించి గ్రామదేవత మంచాలమ్మను, రాఘవరాయుడి బృందావనాన్ని దర్శించుకున్నారు. అనంతరం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులు పొందారు.

రోడ్డును బాగు చేయండి



ముళ్ల కంపలతో మూసుకుపోయిన రహదారి

గోనెగండ్ల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పెద్దనేలటూరు, బురాన్‌దొడ్డి గ్రామాల మధ్య ఉన్న రోడ్డు ముళ్ల కంపలు, గుంతమయంగా మారడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని అనేక సార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముళ్లకంపలు ఏపుగా పెరగడంతో కాలినడకన వెళ్లేందుకు ఇబ్బందిగానే ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): భావితరాలకు ఉన్నత భవిష్యత్ ఇచ్చేందుకు ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడం అందరి బాధ్యతగా తీసుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి రాఘవేంద్రరెడ్డి, మాజీ సర్పంచ్ టీడీపీ నియోజకవర్గ నాయకులు రఘునాథ్‌రెడ్డిలు అన్నారు. శనివారం గ్రామ కార్యదర్శి వేణుగోపాల్, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నీలకంఠస్వామి ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీలో పాల్గొని వారు మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాలు సుందరంగా పరిశుభ్రంగా, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే విధంగా ప్రతి మూడో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వచ్ఛతపై దృష్టి సారించి అందరిని భాగస్వాములని చేశారని అన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ తమ కాలనీల్లో పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎర్రన్న, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్, జగదీష్, కృపానంద, సుభాష్, ఈరమ్మ, తారాదేవి, షఫీ, కేశన్న, పోలి వీరేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: ప్లాస్టిక్ వినియోగంతో ఎంతో ప్రమాదం ఉందని వాటి నుంచి సమాజాన్ని దూరంగా ఉంచి ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం అని టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పెద్దకడుబూరులో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొని ప్లాస్టిక్ కవర్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో టీడీపీ రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, కురువ మల్లికార్జున, విజయ్, యేసేబు, మీసేవ ఆంజనేయులు, నరసింహారెడ్డి, అయ్యప్ప, రామాంజులు, సత్యన్నగౌడు, శివ,వీరేష్ గౌడ్ లు పాల్గొన్నారు.

నందవరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో పుల్లయ్య తెలిపారు. హలహర్విలో ఎంపీడీవో, నందవరంలో సర్పంచ్ పార్వతి, ఉప సర్పంచ్ శివారెడ్డిగౌడు, ముగతిలో సర్పంచ్ విరుపాక్షిరెడ్డి ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర- స్వర్ణ దివాస్ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమం ఈవోపీఆర్డీ సందీప్, పంచాయతీ కార్యదర్శి బసవరాజు, ఉరుకుందు, రమేషప్పగౌడు, దత్తప్పగౌడు, యల్లాగౌడు పాల్గొన్నారు.

గోనెగండ్ల: స్వచ్ఛఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కింద చెత్త నుంచి సంపదను సృష్టించాలని ఈ కార్యక్రమానికి గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని గ్రామ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్ కోరారు. శనివారం మండల కేంద్రమైన గోనెగండ్ల పంచాయతీ సిబ్బంది పాఠశాల విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాంగ్ ప్రాంగణం నందు మానవహారం ఏర్పాటు చేశారు. చెత్త నుంచి సంపద సృష్టించేందుకు తమ వంతు కృషి చేస్తామని అధికారులు, నాయకులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఎంపీడీవో సత్యన్న గ్రామ సర్పంచ్ పాల్‌దినకరన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా విద్యార్థులతో ర్యాలీగా బయలుదేరి స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో మానవహారం చేపట్టి స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాల్‌దినకరన్, పంచాయతీ కార్యదర్శి శివప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు టౌన్: ఎమ్మిగనూరు పట్టణంలోని మునిసిపల్ కమిషనర్ గంగిరెడ్డి అధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్‌లో కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి నెల మూడో వారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ భాగంగా రాష్ట్రాన్ని, మన పరిసరాలను పరిశుభ్రత గురించి అవగాహన పెంచడం ముఖ్య ఉదేశ్యమన్నారు. కార్యక్రమంలో ఏఈ శరత్,పబ్లిక్ హెల్త్ డీఈ రాజు నాయక్,మేనేజర్ వరప్రసాద్,కౌన్సిలర్ రామదాసు గౌడ్, డీఈఈ నీరజ,రాజునాయక్,సత్యన్నా,శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మిగనూరు సమీపంలోని శ్రీమహాయోగి లక్ష్మమ్మవ్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్ ఆధ్వర్యంలో ప్రజలకు ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించారు. శనివారం హనుమాపురం గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి కిరణ్‌కుమార్ గౌడు సమక్షంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలకు ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు క్షుణ్ణంగా తెలియజేశారు. అలాగే గ్రామంలో ప్లాస్టిక్ కవర్లు శుభ్రం చేసి కాల్చివేశారు. ఈ కార్యక్రమంలో సుశీలమ్మ, దేవదానం, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్

కోసిగి: రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛా దివాస్ కార్యక్రమాన్ని కోసిగిలో శనివారం అధికారులు తూతూ మంత్రంగా నిర్వహించారు. వాల్మీకి సర్కిల్‌లో మానవహారం ఏర్పడి నాలుగు మాటలు చెప్పి కార్యక్రమాన్ని ముగించేశారు. దీంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమం ఇలా నిర్లక్ష్యం చేయడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు. కోసిగితోపాటు అన్ని గ్రామాల్లో పారిశుధ్యం, చెత్తాచెదారం, మురుగునీరు వంటివి దర్శనం ఇస్తున్నప్పటికీ నేటికి శుభ్రం చేయడం లేదు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఈవోఆర్‌డీ హరూన్ రషీద్, ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి, డా.మౌనిక టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, వక్రాణి వెంకటేష్, తోవి రామకృష్ణ, జ్ఞానేష్, మాణిక్యరాజు, హోళగుంద కోసిగయ్య ఉన్నారు.



స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివస్ ర్యాలీలో పాల్గొన్న రాఘవేంద్రరెడ్డి



నందవరంలో ర్యాలీ చేస్తున్న పంచాయతీ అధికారులు



ఎమ్మిగనూరులో ర్యాలీ చేస్తున్నకమిషనర్ గంగిరెడ్డి, సిబ్బంది



కోసిగిలో ఎండలో మానవహారంగా నిలిచివున్న విద్యార్థినులు